ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024





గగనతలం నుంచి ఫైరింగ్ చేస్తున్న హెలికాప్టర్లు



సముద్రంలో బాంబుల పేలుడు... ఎగసిన మూడు రంగులు

అంబరాన్నంటిన నేవీ సంబరం



ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మెరైన్ కమెండో. చిత్రంలో నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్ ఉన్నారు



తేజస్ యుద్ధ విమానం నుంచి బాంబుల ప్రదర్శన

ఆకాశంలో అద్భుతాలు | బాంబులు కురిపించిన జెట్ విమానాలు | సయ్యాటలాడిన చేతక్ హెలికాప్టర్లు

- తొలిసారి దర్శనమిచ్చిన 'తేజస్' యుద్ధ విమానం
- కనులవిందుగా సాగిన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్
- సాగరతీరంలో 'మిలాన్' సందడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

వినువీధుల్లో అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. జెట్ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. చేతక్‌లు సయ్యాటలాడాయి. సీ హాక్‌లు...హలో చెప్పాయి. ఇంకా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ యుద్ధ విమానం...ఇవన్నీ మిలాన్ ఇంటర్నేషనల్ సిటీ పెరేడ్‌లో కనువిందు చేశాయి.

ఆర్‌కే బీచ్‌లో గురువారం సాయంత్రం భారత నౌకాదళం నిర్వహించిన వైమానిక శక్తి ప్రదర్శన కళ్లార్పకుండా చేసింది. మొత్తం 54 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు వాటి శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాయి. పిడుగులు పడుతున్నాయా...అని భ్రమించేలా శబ్దం

... మిగతా 6వ పేజీలో



పరేడ్‌లో పాల్గొన్న ఇండియన్ నేవీ

ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు

'పశ్చిమ'లో ఓట్ల తొలగింపునకు భారీ కుట్ర

- ఓటర్లు స్థానికంగా ఉంటున్నా... లేరని తప్పుడు ఫిర్యాదులు
- అధికారుల క్షేత్రస్థాయి విచారణలో నిర్ధారణ
- బాధ్యులైన 10 మందిపై క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఆదేశం
- ఇప్పటివరకూ కేసు నమోదు చేయని పోలీసులు
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న ఎమ్మెల్యే గణబాబు



విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

ఓట్ల తొలగింపునకు ఉద్దేశపూర్వకంగా పదుల సంఖ్యలో తప్పుడు దరఖాస్తులు సమర్పించిన వ్యక్తులపై పోలీసులు ఇప్పటివరకూ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. సదరు దరఖాస్తుదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా బేఖాతరు చేయడం చర్చనీయాంశమైంది.

పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 4,409 మంది ఓట్లు తొలగించాలని అధికార పార్టీ సానుభూతిపరులుగా భావిస్తున్న 163 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు (ఫారం-7) అప్‌లోడ్ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ఫారం-7 ఇచ్చారన్న ఫిర్యాదు అందడంతో జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ కోసం ముగ్గురి సభ్యులతో కమిటీ వేశారు. కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా...4,409 మందిలో 3,476 మంది ఓటర్లు స్థానికంగా నివాసం ఉండడం లేదని, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లాలని తేలింది. మిగిలిన 933లో 183 ఓట్లకు సంబంధించి ఓటర్లే స్వయంగా తమ పేర్లు తొలగించాలని దరఖాస్తులు అందజేసినట్టు స్పష్టమైంది. కాగా, మరో 750 అభ్యంతరాల్లో 540 మంది ఓటర్లు జాబితాలో ఉన్న అడ్రస్‌లోనే ఉంటున్నారు. అయితే సొంత కారణాల వల్ల తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినట్టు తేలింది. దీంతో 540 అభ్యంతరాలను తిరస్కరించిన కమిటీ, వారి ఓట్లు యథాతథంగా జాబితా ఉంచాలని సూచించింది. కాగా మరో 205 మంది ఓటర్లు... జాబితాలో పేర్కొన్న అడ్రస్‌లలోనే నివాసం ఉంటున్నారు. ఆ 205 మంది ఓటర్లను తొలగించాలని ఉద్దేశపూర్వకంగా అభ్యంతరాలు ఇచ్చారని నిర్ధారించారు. అలా దరఖాస్తు చేసిన వారిలో (ఎక్కువ అభ్యంతరాలు ఇచ్చిన) పది మందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, మరో 13 మందిని హెచ్చరించాలని సిఫారసు చేస్తూ కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారికి విశాఖ పశ్చిమ రిటర్నింగ్ ఆఫీసర్, విచారణ కమిటీ అధికారి హుస్సేన్ సాహెబ్ నివేదిక ఇచ్చారు. ఈ మేరకు పది మందిపై పీపుల్స్ యాక్టు 1950లో సెక్షన్ 31 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేయాలని నగర పోలీసులకు లేఖ రాశారు.

ఓటర్ల జాబితాలో పేర్కొన్న అడ్రస్‌లలో ఓటర్లు ఉన్నప్పటికీ లేరంటూ అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారిలో జి.నూకరాజు అనే వ్యక్తి ముందున్నారు. అతను మొత్తం 114 అభ్యంతరాలు వ్యక్తంచేయగా, అందులో 29 మంది అదే అడ్రస్‌లో ఉంటున్నట్టు తేలింది. అదే మాదిరిగా గొల్లపల్లి కావ్య సక్కురి సత్యవతి 26 చొప్పున, కొలాచిన రవి 23, నమ్మి

... మిగతా 6వ పేజీలో

నగరంలో ఐపీఎల్ మ్యాచ్‌లు

- మార్చి 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్
- ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్ రైడర్స్



విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 22: నగరంలో క్రికెట్ అభిమానులకు శుభవార్త. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రెండు మ్యాచ్‌లు పోతినమల్లయ్య పాలెంలో గల ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్నాయి. ఐపీఎల్ షెడ్యూల్‌ను గురువారం ప్రకటించారు. ఇందులో రెండు మ్యాచ్‌లు (మార్చి 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్, ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్ రైడర్స్) విశాఖకు కేటాయించారు.

ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌ను పంజాబ్ కింగ్స్‌తో మొహాలిలో, రెండో మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్‌తో జైపూర్‌లో ఆడనుంది. చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లతో వరుసగా జరిగే మూడు, నాల్గో మ్యాచ్‌లను విశాఖలో ఆడడం విశేషం.

నాలుగేళ్ల తర్వాత

విశాఖలో నాలుగేళ్ల తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. 2012లో డెక్కన్ చార్జర్స్, 2015లో సన్‌రైజర్స్ హైదరాబాద్, 2016లో ముంబై ఇండియన్స్ జట్లు ఆడిన గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికైంది. 2019లో ఐపీఎల్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు లేకపోయినా కీలకమైన ఎలిమినేటర్, క్వాలిఫైయర్-2 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది.

ఈవెనింగ్ క్లినిక్స్ మూన్నాళ్ల ముచ్చటేనా!?

బోధనాస్పత్రుల్లో మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు క్లినిక్స్ నిర్వహణకు వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాలు


- కేజీహెచ్ సహా అన్నిచోట్ల సాయంకాలం పూట రోగులకు సేవలు అందించనున్నట్టు అధికారుల ప్రకటనలు
- ఆరంభ శూరత్వమే... అమలుకాని ఉత్తర్వులు
- ఓపీ గదులకు తాళాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

బోధనాస్పత్రుల్లో సాయంకాలం కూడా రోగులకు సేవలు (ఈవెనింగ్ క్లినిక్స్) అందించాలన్న ఆదేశాలు నగరంలో అమలు కావడం లేదు. ప్రతిరోజూ ఉదయమే గాకుండా మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకూ (ఈవెనింగ్ క్లినిక్స్) రోగులను చూడాలని బోధనా స్పత్రులకు వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు నగర పరిధిలోని కేజీహెచ్, విమ్స్, ఘోషా, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలో ఈవినింగ్ క్లినిక్స్ నిర్వహించనున్నట్టు అధికారులు ప్రకటించారు. కొద్దిరోజులపాటు సాయంత్రం వేళల్లో రోగులను చూశారు. ఆ తరువాత రోగులు రావడం లేదంటూ క్లినిక్స్‌కు తాళాలు వేసేశారు.

నగర పరిధిలోని బోధనాస్పత్రులకు ప్రతిరోజూ సుమారు మూడు వేల మంది వైద్య సేవల కోసం వస్తుంటారు. కేజీహెచ్‌కు వేయి నుంచి 1200 మంది, విమ్స్‌కు మరో 600 మంది, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రి, ఛాతీ అంటువ్యాధుల ఆస్పత్రి, మానసిక ఆస్పత్రులకు మరో వేయి మంది వస్తారు. వీరంతా ఉదయం ఓపీ (అవుట్ పేషెంట్లు)లో సేవలు పొందుతుంటారు. ఆ సమయంలో అన్ని విభాగాలు కిటకిటలాడుతూ ఉంటాయి. అవసరమైన వారికి రక్త పరీక్షలు, స్కానింగ్ వంటివి రాస్తుంటారు. కొన్ని పరీక్షల ఫలితాలు రావడం ఆలస్యమవుతుంటుంది. ఆ రిపోర్టు వచ్చే సమయానికి వైద్యులు వెళ్లిపోతుంటారు. దీనివల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. అదే వైద్యులు అందుబాటులో ఉన్నట్టయితే రిపోర్టు చూసి...తదుపరి సేవలు అందించడానికి వీలుంటుంది. ఈ ఇబ్బందులను స్వస్తి చెప్పాలన్న ఉద్దేశంతో వైద్య, ఆరోగ్య శాఖ

... మిగతా 6వ పేజీలో



కేజీహెచ్‌లో ఓపీ విభాగాలకు తాళాలు వేసిన దృశ్యం

నేడు సుప్రీంకోర్టు జడ్జి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ లాయర్స్ నేతృత్వంలో ఈనెల 24వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోని గ్రీన్‌పార్కు హోటల్‌లో జరగనున్న సదస్సులో పాల్గొనేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌కుమార్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ శుక్రవారం నగరానికి రానున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ శుక్రవారం సాయంత్రం 5.05 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడ నుంచి సింహాచలం వెళతారు. వరాహ నృసింహస్వామిని దర్శనం చేసుకున్న అనంతరం సర్క్యూట్‌హౌస్‌కు చేరుకుని బస చేస్తారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విజయవాడ నుంచి వందేభారత్ రైలులో బయలుదేరి శుక్రవారం రాత్రి 11.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు. హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్ శుక్రవారం ఉదయం గన్నవరం నుంచి విమానంలో బయలుదేరి నగరానికి వస్తారు. ముగ్గురు న్యాయమూర్తులు 24వ తేదీన సదస్సు ముగిసిన అనంతరం విజయనగరం జిల్లాలో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయలుదేరి వెళతారు.



ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌కు స్వాగతం పలుకుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం

గోపాలపట్నం, ఫిబ్రవరి 22: మిలాన్-24లో పాల్గొనేందుకు గురువారం నగరానికి విచ్చేసిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌కు ఐఎన్ఎస్ డేగాలో ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10.22 గంటలకు విశాఖ చేరుకున్న ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, తూర్పు నౌకాదళ ప్రధానాధికారి రాజేశ్ పెండార్కర్, అరకు ఎంపీ జి.మాధవి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో ఐఎన్ఎస్ చోళాకు బయలుదేరి వెళ్లారు. సముద్రిక ఆడిటోరియంలో నిర్వహించిన 'అంతర్జాతీయ మేరిటైమ్ సదస్సు'లో పాల్గొన్న అనంతరం ఉప రాష్ట్రపతి తిరుగు ప్రయాణమయ్యారు. ఢిల్లీ వెళ్లేందుకు మధ్యాహ్నం 12.30 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆత్మీయ వీడ్కోలు పలికారు.



నగరంలో గురువారం ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ

మహిళల హక్కులను హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులకు బుద్ధి చెప్పండి

- ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం థావలే
- నేటి నుంచి ఐద్వా అఖిల భారత సమావేశాలు

- వార్త మెయిన్‌లో

తెలుగుదేశంతోనే పేదలకు సంక్షేమం

» దక్షిణ నియోజక వర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 22: తెలుగుదేశం అధికారంలోకి వస్తే పేద, బడుగు వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని ఆపార్టీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ 39వ వార్డులో శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్‌లో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయనున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో పేద వర్గాలకు పూర్తి అన్యాయం జరిగిందన్నారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పార్టీ శ్రేణులు ఈ మేరకు ప్రచారంచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకుడు పోలయ్య, తెలుగు మహిళ నాయకులు, బూత్‌లెవెల్ కమిటీ నాయకులు, నందమూరి అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.


గ్రేటర్ 39వ వార్డులో ప్రచారం చేస్తున్న గండి బాబ్జీ, నాయకులు

జగన్ ముస్లింల పాలిట ద్రోహి: మహ్మద్ నజీర్

మహారాణిపేట: వైసీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం సామాజిక వర్గానికి సామాజిక వర్గం వంచనకు లోనైందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. గురువారం పార్టీ కార్యలయంలో ముస్లిం మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ ముస్లింల ద్రోహి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. బటన్ నొక్కుతూ ప్రజలను మోసగించడంలో ఆయన మాస్టర్ డిగ్రీ తీసుకున్నారని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన పాలనలో ముస్లింలను ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎంతో ఆదుకున్నారన్నారు. ఆయన హయాంలో కల్యాణ మస్తు, షాదీతోఫా పథకాల ద్వారా 98 వేల కుటుంబాలకు రూ. 307 కోట్లు ఇచ్చారన్నారు. పెళ్లి రోజే కల్యాణ మండపంలోనే వధువుకు రూ. 50 వేలు అందించినట్టు ఆయన గుర్తుచేశారు. జగన్ అనేక నిబంధనలతో కేవలం 50 వేల కుటుంబాలకు మాత్రమే ఈ పథకం పరిమితం చేశారని తెలిపారు. ఈసమావేశంలో ముస్లిం నాయకులు అబ్దుల్ చిన రహమాన్ అబ్దుల్ ఆనీఫ్ జఫ్రుల్లా, షేక్ రహ్మతుల్లా, మహ్మద్ గౌస్ అబ్దుల్ గఫూర్, రఫీ, కాలీషా, యాసీన్ , బాషా, నజర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వృక్ష శాస్త్రంపై జాతీయ సదస్సు ప్రారంభం


సదస్సులో పాల్గొన్న ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 22: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఐక్యూఏసీ సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. ముఖ్య అతిథులు ఏయూ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రం సహ సంచాలకులు డాక్టర్ పీవీకే జగన్నాథరావు హజరయ్యారు. వృక్షశాస్త్రంలో ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అన్న అంశంపై ప్రసాద్‌రెడ్డి, పంట అనంతర దిగుబడిలో నష్టనివారణకు సాంకేతిక నైపుణ్యాలపై జగన్నాథరావులు ప్రసంగించారు. వ్యవసాయం, బయోటెక్నాలజీ, హెర్బల్ టెక్నాలజీ, ఫార్మసీ, బయోడైవర్సిటీ కన్జర్వేషన్, వాతావరణ మార్పులు, గ్రీన్ టెక్నాలజీస్ తదితర ఆరు ఇతి వృత్తాలతో ఈసదస్సులో చర్చిస్తామని కన్వీనర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ పద్మ సుందరి, సిస్టర్‌హేమ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ పికే జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి: యూటీఎఫ్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వంఇవ్వాల్సిన రూ.20వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ బకాయిలపై ఏపీజేఏసీ ఆధ్వర్యంలో తాలుకా, జిల్లాస్థాయిలో ధర్నాలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిమాండ్ల సాధన కోసం ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం ఉన్న సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను చర్చలకు ఆహ్వానించారన్నారు. ఒక్క పక్క చర్చలకు ఆహ్వానిస్తూనే చలో విజయవాడను ఉక్కు పాదంతో అణచి వేయడానికి ముందస్తు అరెస్టులకు పాల్పడుతూ, ఎక్కడికక్కడ పోలీసులు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ద్వంద్వ వైఖరి విధానాలను వీడి ఉద్యోగుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22: సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ,అండమాన్ నికోబార్ ప్రాంతీయ వనరుల కేంద్రం, స్నేహ సంధ్య ఏజీకేర్ ఫౌండేషన్ సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సును ప్రేమ సమాజంలో నిర్వహించింది. దేశంలో 60 ఏళ్ల పైబడిన 160 మిలియన్ల మంది జనాభా పెరుగుతున్న నేపథ్యంలో వారి అవసరాలను తీర్చడానికి సమగ్ర వ్యూహాల అవసరాల ప్రాధాన్యంపై ఈ సదస్సును ప్రారంభించారు. హెరిటేజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.ఆర్.గంగాధరన్ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఏజీకేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డా.ఎస్.ఎస్.రాజు మాట్లాడుతూ సదస్సు వృద్ధుల సమస్యలపై అవగాహన పెంచడానికి వారికి సాయం చేయడానికి ఒక వేదిక చేయూతగా నిలుస్తుందన్నారు. సదస్సులో వృద్ధుల ఆరోగ్యం, ఆర్థిక భద్రత, దుర్వినియోగం, సంరక్షణ వంటి అంశాలపై నిపుణులు చర్చించారు.

ఎన్నికల ముందు రోడ్ల అభివృద్ధి గుర్తుకు వచ్చిందా?

» జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్


జనంలోకి జనసేనలో మాట్లాడుతున్న ఉషాకిరణ్

కంచరపాలెం, ఫిబ్రవరి 22 : నాలుగున్నరేళ్లగా వైసీపీ ప్రభుత్వం నగరాభివృద్ధిని పట్టించుకోకుండా మరి కొద్దిరోజుల్లో ఎన్నికలు వస్తున్న సమయంలో వీధి వీధికి రోడ్లు వేస్తుండడం హాస్యాస్పదంగా ఉందని ఉత్తర నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ విమర్శించారు. జీవీఎంసీ 55వ వార్డు పరిధి జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా దీప్తి ఆసుపత్రి, కంచరపాలెం హైవే తదితర ప్రాంతాల్లో ఆమె పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోడ్లకు మరమ్మతులుగాని, నూతన రోడ్లు ఎక్కడా వేసిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో రోడ్ల దుస్థితి ఇప్పుడు గుర్తుకు వచ్చినట్టుందని విమర్శించారు. ముఖ్యమంత్రి నగరానికి వచ్చిన ప్రతిసారీ మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు. సీఎం సభకు రావాలని మహిళలను బెదిరించి బలవంతంగా తీసుకువెళ్లి మండుటెండల్లో సైతం నిలబెడుతున్నారన్నారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మేరుగు నూకరాజు, యల్లాజీ, నవీన్, వర్మ, వెంకటేష్, రంజిత్ పాల్గొన్నారు.

'అడ్డంకులు అధిగమిస్తేనే జీవితంలో రాణింపు'



స్కాలర్‌షిప్‌ల ప్రదానంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తదితరులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22: చదువు విషయంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని అధిగమించి ముందుకుసాగితేనే జీవితంలో మంచి స్థాయికి చేరుకోగలరని వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా 189 మంది విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, దిశా సీఐ కల్యాణి, ఏవీఎన్ వుమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ హాజరై జ్యోతి ప్రజల్వనగావించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చునన్నారు. ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలని సూచించారు. తద్వారా దేశాభివృద్ధిలో కీలకం కావాలన్నారు. సంకల్ప బలం ఉంటే పేదరికం అడ్డుకాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ ఫేబిన్, మేనేజర్ కె. సునీత , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేవీలో థింకింగ్ డే ఉత్సవాలు


వేడుకలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 : స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు లార్డ్ స్టీవెన్ సన్ బాడెన్ పౌల్, లేడీ బాడేన్ పౌల్ జయంతి సందర్భంగా తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం ప్రపంచ థింకింగ్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్ బాడెన్ లార్డ్ పౌలు దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్కౌట్ ఉద్యమం గొప్పతనాన్ని వివరించారు. అలాగే సంగీత ఉధ్యాయుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు సర్వధర్మ ప్రార్థనలు చేశారు. వజ్ఞా మణిబాబు ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బీఎస్ మీనా, హెచ్ఎం శైలజ, అధ్యాపకులు విజయలక్ష్మీ, షాహ్లా సబ్రీన్, సత్యనారాయణ, కుందన్‌లాల్, మిట్టపల్లి రేఖ పాల్గొన్నారు.

25న శ్రీకృష్ణ దేవరాయ, రంగా విగ్రహాల ఆవిష్కరణ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22: శ్రీకృష్ణ దేవరాయ , వంగవీటి మోహనరంగా విగ్రహాలను గోపాలపట్నం పద్మనాభ నగర్‌లో ఈనెల 25న ఆవిష్కరించనున్నట్టు శ్రీ కృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండ్రెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కంపర సత్తిబాబు , గౌరవ సలహాదారు గంట్ల శ్రీనుబాబు తెలిపారు .గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.కార్యక్రమానికి వైసీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, బొత్స ఝాన్సీ తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు.ఈ సమావేశంలో కె.కోటేశ్వర రావు ఎ.రాజశేఖర్, కె .నాగరాజు, డి.మోహన్, జి.మురళీకృష్ణ, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయుడు


దయాబాను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 : టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయులవసతి గృహంలో ఆశ్రయంపొందుతున్న దయాబా (50)ని ఒడిశాలోని సుందర్‌ఘడ్ జిల్లా మెయిడాలోని సవిందపూర్‌గ్రామంలో ఉన్న సోదరుడుకి శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు అప్పగించినట్లు వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. గతేడాది ఆగస్టులో నగరంలోని ఫుట్‌పాత్‌పై దయనీయ స్థితిలో ఉన్న ఆయనను రెస్క్యూ చేసి మానసిక ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించామన్నారు. ఆయన కోలుకోవడంతో పేరు, వివరాలు చెప్పారన్నారు. దీంతో దయాబాను గురువారం శ్రద్ధాఫౌండేషన్ ప్రతినిధులు ఆయన సోదరుడివద్ద చేర్చారు.

పథకాల పంపిణీలో వలంటీర్లు కీలకం


సన్మానం పొందిన వలంటీర్లు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని వైసీపీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపుఆనంద్ అన్నారు. డాబాగార్డెన్స్ ద్వారకాబజార్‌లో గురువారం వలంటీర్స్‌కు అభినందన సభలో ఆయన మాట్లాడారు.వార్డు పరిధిలోని ఆరు సచివాలయాల వలంటీర్లకు సేవా పురస్కారాలను అందజేశారు. సచివాలయ సిబ్బంది ఆర్‌పీ వరలక్ష్మి, కన్వీనర్ కొండ భవాని, గారి రాంబాబు, బాబూరావు, కందిరేగుల నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి: గంటా

సీతమ్మధార, ఫిబ్రవరి 22: టీడీపీ గెలుపునకు కృషి చేయాలని మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్టీకి విశేష సేవలందిస్తున్న 14వ వార్డు నాయకుడు గొంప ధర్మారావును అభినందించారు. ధర్మారావుబలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. ఆయనను సన్మానించారు.

ఇందిరా ప్రియదర్శిని స్టేడియం మరమ్మతులు పూర్తిచేయండి

» జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ


స్టేడియంను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం మరమ్మతు పనులను సత్వరం పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ ఆదేశించారు. స్టేడియం ఆధునికీకరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అతిపెద్ద స్టేడియంగా గుర్తింపు పొందిన ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో త్వరలో జాతీయ, అంతర్జాతీయ క్రీడలు జరుగనున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అప్పటికి అంతా సిద్ధం చేయాలన్నారు. గ్యాలరీలకు ఆనుకుని ఉన్న హాళ్లు, గదుల్లో ఇండోర్ గేమ్స్‌కి అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం దొండపర్తి నుంచి జాతీయరహదారి వరకూ అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్ పనులను పరిశీలించారు.

కలెక్షన్ కింగ్ ఉక్కు అధికారి!

» రోజువారి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు

» ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 22: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఎలాంటి వ్యాపారం చేయాలన్నా అందుకు ఉక్కు యాజమాన్యం అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కొన్ని నిబంధనల మేరకు వ్యాపారాలకు ఉక్కు ఉన్నతాధికారులు అనుమతివ్వడం జరుగుతుంది. అయితే ఉక్కుటౌన్ అడ్మిన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి మాత్రంఅలాంటి అనుమతి పత్రం లేకుండానే చిరు వ్యాపారాలు సాగించేందుకు మౌఖికంగానే అనుమతిస్తూ వారినుంచి రోజువారి కలెక్షన్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలువెల్లువెత్తుతున్నాయి. దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టు జంక్షన్ కూడలి నుంచి గాజువాక కణితి మార్గంలోని చెక్‌పోస్టు వరకు గల స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గంలో ఎక్కడపడితే అక్కడ చిన్నచిన్న వ్యాపారాలు సాగుతున్నాయి. ఇవన్నీ అనధికారికంగానే నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వీటిని నియంత్రించాల్సిన ఓ ఉక్కు అధికారి నిబంధనలకు విరుద్ధంగా చిరువ్యాపారుల నుంచి రోజువారి కలెక్షన్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి ఉదయంఓ మార్గంలో, సాయంత్రం వేళల్లో వేరే మార్గంలోనూ అనధికారిక వసూళ్లకు పాల్పడుతున్నట్టు పలువురు ఉక్కు కార్మికులు, చిరు వ్యాపారులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. అయితే వీటికి అడ్డుకట్ట చేయాల్సిన ఉన్నతాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రధానంగా స్టీల్‌ప్లాంట్ కణితి జంక్షన్ నుంచి చెక్‌పోస్టు వరకు ఎంతోమంది తమ వ్యాపారాలను అనధికారికంగానే కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరైనా కొత్త వ్యక్తి రోడ్డు పక్కన వ్యాపారం చేస్తే వారినుంచి తొలి సారిగా అధిక మొత్తంలో మామూళ్లు వసూలు చేయడం, ఆ తర్వాత రోజువారి కలెక్షన్లకు పాల్పడుతున్నట్టు సమాచారం. ఎవరైనా వ్యాపారి ఒకరోజు మాములు చెల్లించకపోతే ఆ మర్నాడు రెండు రోజులకు కలిపి నగదు చెల్లించాల్సి వస్తుందని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కాగా టౌన్‌షిప్‌లోని ప్రధాన జంక్షన్‌లలో టిఫిన్ సెంటర్‌లకు గతంలో అనుమతి ఇచ్చారు.కొంతకాలం తర్వాత వాటికి అనుమతులు రద్దు చే యడంతోపాటు వాటర్ కనెక్షన్లకు కట్ చేశారు. అయినా టిఫిన్ సెంటర్ల నిర్వా హ కులు అక్కడనుంచి వెళ్లకుండా తమ వ్యాపారాలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇవన్నీ సదరు అధికారికి తెలిసినప్పటికీ మామూళ్ల మత్తులో పడి నిబంధనలకు నీళ్లొదిలి ముందుకు సాగుతున్నారు. సదరు అధికారిపై ఉక్కుఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 22: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం సీతంపేట విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సీతంపేట మెయిన్ రోడ్డు, విజయ ఆసుపత్రి ప్రాంతం, గురుద్వారా ప్రాంతం, సీతంపేట, శాంతిపురం, జీవీకే ప్లాజా, రమా ఆసుపత్రి, రిలయన్స్ పెట్రోల్ బంక్ ప్రాంతం, సీతమ్మధార కేన్సర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలన్నారు.

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ సింహచలం నాయుడు తెలిపారు. కైలాసపురం, సత్యసాయి నగర్, సింగాలమ్మపురం ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంచరపాలెం, ఫిబ్రవరి 22 : జీవీఎంసీ 48వార్డు ఇందిరానగర్-3లో రూ. 26 లక్షలతో నూతన సామాజిక భవన నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఉత్తర వైసీపీ సమన్వయకర్త కె.కె.రాజు, వార్డు కార్పొరేటర్ గంకల కవిత పనులను ప్రారంభించారు ఊర్వశి జంక్షన్ నుంచి బర్మా క్యాంపు వరకు నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. వైసీపీ వార్డు ఇన్‌చార్జి నీలిరవి, గంకల అప్పారావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 43వ వార్డు వేంకటేశ్వర కాలనీలో రూ.57.70 లక్షల వ్యయంతో నిర్మించిన సామాజిక భవనాన్ని కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు ప్రారంభించారు. నాయకులు దుప్పలపూడి శ్రీనివాస్, కాయల శ్రీనివాస్, కాయల పోలీస్, పులపా రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన నేవీ సంబరం

... 5వ పేజీ తరువాయి

చేస్తూ దూసుకొచ్చిన జెట్ విమానాలు మిరుమిట్లు గొలిపే బాంబుల వర్షాన్ని కురిపించాయి. సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఉపయోగించే చేతక్ హెలికాప్టర్లు వేదిక ముందు అతిథుల ఎదుట అతి తక్కువ ఎత్తులో ఎగురుతూ సయ్యాటలాడాయి. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమం...జాతీయ పతాకంలోని మూడు రంగులు సముద్రంలో నుంచి పైకి ఎగిసేలా పేల్చిన బాంబులతో మొదలైంది. బీచ్‌లో బందీలను విడిపించడానికి కమెండోలు జెమినీ బోట్లపై వచ్చి చేసిన దాడి యుద్ధ రంగాన్ని తలపించింది. ఆకాశంలో ఎనిమిది వేల అడుగుల ఎత్తున ఎగురుతున్న హెలికాప్టర్ నుంచి ఒకరి తరువాత మరొకరుగా దూకిన మెరైన్ కమెండోలు వేదిక ముందు సురక్షితంగా దిగి ముఖ్య అతిథికి జ్ఞాపికను బహూకరించిన సాహస కార్యం అందరినీ కట్టిపడేసింది. మిగ్ 29కు యుద్ధ విమానాల గర్జన చెవులను హోరెత్తించింది. కొత్తగా నౌకాదళంలో చేరిన సీ హాక్ హెలికాప్టర్లు, దేశీయ తయారీ తేజస్ యుద్ధవిమానం విశాఖ ప్రజల ముందు ప్రత్యక్షమయ్యాయి. నిఘా విమానాలు డార్నియర్లు, బోయింగ్‌తో తయారైన పీ8ఐ నిఘా విమానం సముద్ర రక్షణకు మేమున్నామని చాటాయి. విమాన వాహక నౌకలు విక్రాంత్, విరాట్‌లు వేదికకు ఎదురుగా సముద్రంలో కొలువుదీరాయి.

కలర్‌ఫుల్ పెరేడ్

మిలాన్‌కు హాజరైన 51 దేశాల ప్రతినిధులు వారి జాతీయ పతకాలను చేబూని ఒకరి తరువాత మరొకరు కవాతు చేసుకుంటూ వచ్చిన దృశ్యం ప్రపంచం మొత్తం విశాఖలోనే ఉందా?...అనిపించింది. నేవీ స్కూల్ చిన్నారులు, కోరుకొండ సైనిక్ స్కూల్ పిల్లలు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బంగ్లాదేశ్, శ్రీలంక, వియత్నాం, రష్యా, ఇరాన్, మారిషస్, ఫ్రాన్స్ తదితర దేశాలతో పాటు ఏపీ పోలీస్, కోస్టుగార్డు, ఏపీ పోలీస్ బ్యాండ్, నేవీ బ్యాండ్ బృందాలు పాల్గొన్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్ విశాఖ ప్రజలను ఉద్దేశించి కొద్దిసేపు మాట్లాడారు. కార్యక్రమంలో తూర్పు నౌకాదళం చీఫ్ రాజేశ్ పెంధార్కర్, మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరికుమారి, కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవి శంకర్, నేవీ కుటుంబాలు, నగర వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.

ఈవెనింగ్ క్లినిక్స్ మూన్నాళ్ల ముచ్చటేనా!?

... 5వ పేజీ తరువాయి

ఈవినింగ్ క్లినిక్స్ నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ఆంధ్ర మెడికల్ కళాశాలలోని బోధనాస్పత్రుల్లో ఈ మేరకు ఏర్పాట్లు చేసిన అధికారులు కొద్దిరోజులపాటు క్లినిక్స్ నిర్వహించారు. కానీ, ఏం జరిగిందో తెలియదు కానీ ప్రస్తుతం బోధనాస్పత్రుల్లో ఈవినింగ్ క్లినిక్స్ నడవడం లేదు. ఈవినింగ్ క్లినిక్స్ నిర్వహించాల్సిన గదులకు తాళాలు వేసి ఉంటున్నాయి. సాయంత్రం క్లినిక్స్ నిర్వహిస్తే ఉదయం పూట ఓపీలో ఒత్తిడి తగ్గుతుంది. కానీ, ఈవినింగ్ క్లినిక్స్ నిర్వహించేందుకు వైద్యులు ఆసక్తి చూపించడం లేదు. ఉన్నతాధికారులు కూడా వారిపై ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారు. దీంతో ఒకవేళ ఎవరైనా రోగులు రిపోర్టులు తీసుకుని వైద్యుల వద్దకు వెళ్లానుకుంటే ఆయా విభాగాలకు వెళ్లాలని చెబుతున్నారు. అక్కడ సీనియర్ వైద్యులు ఉండదు. దీంతో చేసేది లేక మరోరోజు ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది.

రోగులు రావడం లేదంటున్న అధికారులు

ఈవినింగ్ క్లినిక్స్ గురించి ప్రజలకు అవగాహన లేకపోవడం, పరీక్షల రిపోర్టు అదేరోజు ఇచ్చే అవకాశం లేకపోవడంతో సాయంత్రం వేళ వస్తున్న రోగుల సంఖ్య తక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. కేజీహెచ్‌లో ఆయా విభాగాల్లో వైద్యులు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని, సాయంత్రం వేళ ఎవరైనా వస్తే చూస్తున్నారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. విమ్స్‌లోనూ ఈవినింగ్ క్లినిక్స్ నిర్వహిస్తున్నామని, రోగులు ఐదారుగురికి మించి రావడం లేదని డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. జనరల్ మెడిసిన్ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు

... 5వ పేజీ తరువాయి

లీలానాగవల్లి 20, సుండి సుజాత 15, కె.యశ్వంతరావు 12, కాంద్రేగుల సత్తిబాబు 11, బత్తుల రంగనాయకమ్మ, రొంగలి సుధ ఏడు దరఖాస్తులు సమర్పించినట్టు తేలడంతో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మరో 13 మందిని గట్టిగా హెచ్చరించాలని నిర్ణయించారు.

ఆ మేరకు పది మందిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంది. కానీ ఆ పది మంది అధికార పార్టీకి చెందినవారు కావడంతోనే ఇప్పటివరకూ కేసులు నమోదు చేయడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ స్వయంగా సిఫారసు చేసినా పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆ పది మందిని కాపాడుకోవాలని వైసీపీ నేతలు నిర్ణయించినందునే పోలీసులు ముందుకువెళ్లడం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడానికి విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సిద్ధమవుతున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్టు వెల్లడించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కె.పోతన్న

వాలీబాల్ పోటీలు ప్రారంభం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 22: గంగవరం హైస్కూల్ మైదానంలో గురువారం రెండు రోజుల పాటు జరిగే మండల స్థాయి వాలీబాల్ పోటీలు స్టీల్‌ప్లాంట్ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మాధవస్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలను వెల్ఫేర్ సెంటర్ గంగవరం శాఖ నిర్వహిస్తుంది. సెంటర్ కోశాధికారి కె.పోతన్న ఈ పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఇటువంటి పోటీలో ఎంతగానో దోహదపడతాయన్నారు. ముగింపు రోజైన శుక్రవారం విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ

అగనంపూడి, ఫిబ్రవరి 22: స్థానిక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం పలువురు పేదలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధి మస్తాన్‌రెడ్డి, స్థానిక నాయకులు ఐఆర్‌సీహెచ్ అప్పారావు వీటిని పేదలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదపలో ఉన్నవారికి అండగా నిలవడమే తమ ట్రస్టు లక్ష్యమన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన నిరుపేద అయిన రాజాన తాతారావు కుటుంబానికి రూ.రెండు వేల నగదును అందజేశారు. ట్రస్టు ప్రతినిధులు పట్టా రామఅప్పారావు, జి.సుశీలగజేంద్రరావు, ఎస్.గోవిందరావు, జె.గణేశ్, వెంకటరమణ, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 22: విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్‌ఎగ్జిబిషన్లు వంటివి ఎంతగానో దోహదపడతాయని గాజువాక ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ (జిప్సా) అధ్యక్షుడు పి.భాస్కరరావు అన్నారు. నాతయ్యపాలెంలోని సాయి శార్వాణి పాఠశాలలో గురువారం ఆయన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించా మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టుల నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బిచంద్రమౌళి, కెసి నాయుడు, బి శ్రీనివాస్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'పై పీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 22: విశాఖ పర్యటనకు విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పష్టమైన హామీ ఇవ్వాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరాం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీఎంతో సీఎం జగన్ ప్రకటన చేయించేలా చూడాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కార్మికులు మూడేళ్లుగా పోరాటాలు సాగిస్తున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎన్ఎండీసీ నుంచి ఐరన్ ఓర్ ఇవ్వడం లేదని, విదేశాల నుంచి కోల్ చాలా సులభంగా తెచ్చుకోగలుగుతున్నామని, కానీ సమీపంలో ఉన్న ఐరన్ ఓర్‌ను మాత్రం తెచ్చుకోలేకపోతున్నామని వాపోయారు. ప్లాంట్‌కు వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చి, ఉద్యోగులను నియమించాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ అధికారికి వరల్డ్ బుక్ రికార్డులో స్థానం

మల్కాపురం, ఫిబ్రవరి 22: విద్య, యువజన, సామాజిక సేవా రంగాలలో విశేష కృషి చేస్తున్నందుకు గాను జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఐపీఎస్ భాగ్యలక్ష్మికి వరల్డ్ బుక్ రికార్డులో సభ్యత్వం కల్పిస్తూ ఆ సంస్థ ఆన్‌లైన్‌లో ప్రశంసా పత్రాన్ని అందజేసింది. ఈసందర్భంగా ఆమెకుఇండియన్ మారీటైమ్ యూనివర్సిటీనేవల్ ఆర్కిటెక్చర్ విభాగాధి పతి షీజా జనార్దన్ , అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రశంసా ప త్రం అందుకుంటున్న భాగ్యలక్ష్మి

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 20, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 48, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 55, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 20, క్యారెట్ 20, దొండకాయలు 38, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 105, బరబాటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 215, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 34 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

నెరవేరనున్న వంతెన కల

దశాబ్దాల కోరిక ఫలించనుండడంతో సర్వాత్రా హర్షాతిరేకం

నేడు చుక్కవానిపాలెం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభం



చుక్కవానిపాలెంలోని రైల్వే క్రాసింగ్ గేటు

ఆటోనగర్, ఫిబ్రవరి 22: పారిశ్రామిక ప్రాంతంలోని ఆటోనగర్ అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా నిలిచిన డీ-బ్లాక్‌లోని చుక్కవానిపాలెం రైల్వే క్రాసింగ్ గేటు స్థానంలో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం జరగాలన్న ప్రజల కల సాకారం కానున్నది. ఏళ్ల తరబడి ఇక్కడి రైల్వే గేటు వల్ల ఇబ్బందులకు గురవుతున్న పారిశ్రామికవాసులు, పరిసర ప్రాంతాల ప్రజలకు ఇక్కడ వంతెన నిర్మాణం పూర్తయితే ఉపశమనం లభించినట్ల వుతుంది. దశాబ్ద కాలంగా చుక్కవానిపాలెం సమీపంలో రైల్వే క్రాసింగ్ గేటు స్థానంలో ఫ్లైఓవర్‌ను నిర్మించాలని వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనకు ఎట్టకేలకు రైల్వే యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎండీబీ, నేషనల్ హైవేస్ అండ్ సీఆర్ఎఫ్ సేతుబంధన్ ప్రాజెక్టులో భాగంగా ఇక్కడ ఫ్లైఓవర్ పనులను ప్రారంభిస్తున్నారు.

ప్రజలు ఇబ్బందులు తీరుతాయి



చుక్కవానిపాలెం వద్ద తరచూ రైల్ గేటు మూసి వేయడం వల్ల ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏపీఐఐసీ, ఐలా తరఫున ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం శతవిధాల ప్రయత్నించాం. ఎట్టకేలకు అధికారులు సమస్య పరిష్కారానికి గాను చర్యలు చేపట్టడం అభినందనీయం. ఇక్కడ వంతెన నిర్మాణం పూర్తయితే ప్రజల ఇబ్బందులు తీరిపోతాయి.

-సత్యనారాయణరెడ్డి, ఏపీఐఐసీ, ఐలా చైర్మన్

ఫ్లైఓవర్ నిర్మాణం ఆనందదాయకం



చుక్కవానిపాలెంలోని రైల్వే గేటు అధిక సమయం మూసి ఉండడంతో ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న కర్మాగారాల నిర్వాహకులు ఆర్థికంగా నష్టానికి గురయ్యేవారు. పారిశ్రామికవాసులు, కార్మికులు, విద్యార్థులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు నానా పాట్లు పడేవారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆటోనగర్ పరిశ్రమలు, ప్రజల తరపున పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఎట్టకేలకు వంతెన పనులు ప్రారంభం కానుండడం ఎంతో ఆనందంగా ఉంది.

-కొల్లి ఈశ్వరరావు, ఐలా వైస్ చైర్మన్

వైసీపీ దురాగతాలను ప్రజలు తిప్పికొట్టాలి

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు

ఆటోనగర్, ఫిబ్రవరి 22: అమాయక ప్రజలను, ప్రతిపక్ష నాయకులను, మీడియాపై వైసీపీ చేస్తున్న దాడులు, దురాగతాలను అందరూ తిప్పికొట్టాలని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు పిలుపునిచ్చారు. శ్రీనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం రాత్రి జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని, బూత్ స్థాయి ఏజెంట్లు ప్రజలతో మమేకం కావాలని కోరారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలన్నారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు, తాగునీరు, నిత్యావసర ధరలను పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ డి.గోవిందరెడ్డి, జి.అప్పారావు, కరణం కనకారావు, కాదా శ్రీను, లంకల మురళీదేవి, ప్రియదర్శిని, జి.వెంకట్రావు, ఎస్.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోన తాతారావు

కార్మిక సంఘాలు ఐక్యతతో పోరాటాలు సాగించాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 22: కార్మిక సంఘాలు ఐకమత్యంగా ఉంటేనే పోరాటాలు సజావుగా సాగి విజయాలు సాధించుకోవచ్చని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,106వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారా స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి కార్మికునిపై ఉందన్నారు. ఉక్కు కార్మికుల కోసం అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో సాధించుకున్న పరిశ్రమను వదులుకునేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ నిరంకుశత్వాన్ని వీడకపోతే రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదగంట్యాడ, ఫిబ్రవరి 22: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో సుమారు రూ.ఐదు కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మేయర్ హరి వెంకటకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. సీతానగరం, నెల్లిముక్కు, దొమ్మేటివీధి, నీలాపువీధుల్లో పిల్లల ఆటవస్తువులు, జిమ్‌ల ఏర్పాటుకు, నెల్లిముక్కు రామాలయం వద్ద కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు, సీతానగరంలో కమ్యూనిటీ హాల్, పెంటమాంబ ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలానికి ప్రహరీ నిర్మాణం, పెదగంట్యాతిద శ్మశానవాటిక ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్‌లో రూ.52 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు, రహదారులు, పార్కుల అభివృద్ధికి మేయర్ హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే వైసీపీ ధ్యేయమన్నారు. కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామ న్నారు. నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, వేణుబాబు, గోవింద్, దామోదర్, గోవిందరాజులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

- పెందుర్తి, పరిసరాల్లో దొంగలు హల్‌చల్
- అపార్ట్‌మెంట్లలో బంగారం, నగదు అపహరణ

పెందుర్తి, ఫిబ్రవరి 22: పెందుర్తి, పరిసరాల్లో దొంగలు విజృంభిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత ముసుగులు ధరించిన అగంతకులు అపార్ట్‌మెంట్లలోకి ప్రవేశించి అందినకాడికి దోచుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం పెందుర్తి సమీపపాన ప్రశాంతినగర్, సూర్యానగర్, బాలాజీనగర్‌లలోని బహుళ అం తస్తుల భవనాల్లోని ఫ్లాట్‌ల్లో వరుస చోరీలు జరిగాయి. సూర్యానగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో తాళం వేసి ఉన్న ఫ్లాట్‌లోకి దొంగలు చొరబడి మూడు తులాల బంగారం, ఐదు తులాల వెండితోపాటు విలువైన వస్తువులు ఎత్తుకుపోయారు. బాలాజీనగర్, ప్రశాంతినగర్‌లలోని అపార్ట్‌మెంట్లలోకొన్ని ఫ్లాట్‌లలోనూ చోరీ జరిగింది. ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు కొంత మేర నగదు మాయం చేశారు. అపార్ట్‌మెంట్లలో చోరీకి పాల్పడిన వారు ముసుగుల ధరించి ఉన్నట్టు తెలుస్తోంది. వీరంతా అంతర్రాష్ట్రీయ ముఠాయేమోనని స్థానికులు భీతిల్లుతున్నారు. దర్జాగా అపార్ట్‌మెంట్ల మెట్లపై నుంచి ముసుగులు ధరించి వెళ్లిన ఆగంతకుల దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యారు. చోరీకి పాల్పడిన అగంతకుల వద్ద మారణాయుధాలున్నట్టు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలకు నెలకు ముందు వేపగుంట సమీపం అప్పన్నపాలెంలో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో ముసుగులు ధరించిన అంగతకులు ప్రవేశించి తాళం వేసి ఉన్న ఫ్లాట్లల్లో చోరీకి పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. ఒకే తరహాలో ముసుగు ధరించిన వ్యక్తులుండడం ఈ చోరీల న్నీ ఒకే ముఠా పనేనా? అని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో అపార్ట్‌మెంట్ల భద్రత ప్రశ్నార్థకమవుతోందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

గత ఏడాదిగా ఘటనల వివరాలు

గత నెలలో అరకు వెళ్లిన కుటుంబం పెందుర్తిలో తాళం వేసిన ఉన్న ఇంటి తలుపులు పగలుగొట్టి 10 తులాల బంగారం.. 50 వేలు నగదు లూటీ చేశారు. ఏడాది క్రితం చినముషిడివాడ వుడాకాలనీలోని ఓ ఇంటికిటికీ గ్రిల్ వంచి కిలో వెండి, 50 నగదు ఎత్తుకెళ్లారు. అలాగే, ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు బ్యాగుల్లోని లక్ష్మీపురం, వేపగుంటలలో వేర్వేరుగా జరిగిన రెండు సంఘటనల్లో 18 తులాల బంగారం అపహరించారు. సరిపల్లి, జంగాలిపాలెంలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడి ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఈక్రమంలో ఇటీవల స్టేషన్ క్రైమ్ ఎస్ఐగా ఉన్న సల్మాన్‌బేగ్‌ను ఓచోరీ కేసు దర్యాప్తులో అవినీతి పాల్పడ్డారని ఆరోపణలు రావటంతో వీఆర్‌కు సరెండర్ కావడం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది. ఇప్పుడు ఎన్నికల బదిలీలు పోలీసు శాఖలో అంతా కొత్తవారు వచ్చారు. కొన్ని కేసుల్లో నిందితులను పట్టుకున్నా, రికవరీలో పోలీసులు గోప్యత పాటిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి,



పెందుర్తిలో ఓ అపార్ట్‌మెంట్‌లో చొరబడుతున్న ముసుగు ధరించిన అగంతకులు

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయండి

- యూనియన్ నేత సత్యనారాయణ మూర్తి



మాట్లాడుతున్న యూనియన్ నేత సత్యనారాయణ మూర్తి

మల్కాపురం, ఫిబ్రవరి 22: కోరమాండల్ ఎరువుల కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కార్మిక చట్టప్రకారం వేతనాలు చెల్లించాలని, లేకుంటే సమాన పనికి సమాన వేతనమైనా ఇవ్వాలని కోరమాండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సీనియర్ నాయకులు, విశాఖ పోర్టు ట్రేడ్ యూనియన్ గౌరవాధ్యక్షులు జీవీ సత్యనారాయణ మూర్తి (నాని) డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి నెలకు రూ. 26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనరల్ షిఫ్ట్‌లో విధులకు వెళ్లే వారికి ఉదయం 8:15 నిమిషాల వరకు టైమింగ్ ఉంచాలన్నారు. దురదృష్టవశాత్తు ఏ కార్మికుడికైనా ప్రమాదం జరిగితే వెంటనే తగిన వైద్యం అందించే విధంగా సంస్థ యజమాన్యం, కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇటీవలే కాంట్రాక్ట కార్మికుడు ప్రసంగి శంకర్‌రావు మృతి చెందారని కానీ ఆ యన కుటుంబానికి యజమాన్యం ఎటువంటి న్యాయం చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, మహాలక్ష్మీ, కె.శంకర్, కె.సత్యనారాయణరెడ్డి, ప్రకాశ్, రాంబాబు, శ్రీను, శేఖర్, ప్రకాశ్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, ఫిబ్రవరి 22: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయిబాబాను నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు జరపగా, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లలిత, విష్ణుసహస్రనామ పారయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యనారాయణ, పంకజం, సూరీడమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాల పంపిణీకి ఏర్పాట్లు

- ఎన్నికల్లో లబ్ధి కోసమేనని విపక్షాల ఆరోపణ

వేపగుంట ఫిబ్రవరి 22: వేపగుంట జోనల్ కార్యాలయ పరిధిలోని 89 నుంచి 98వ వార్డుల్లో పనిచేస్తున్న వలంటీర్లకు పురస్కారాలందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. నియోజవర్గ పరిధిలో బాగా పనిచేసిన ముగ్గురు వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పేరిట ఒక్కొక్కరికీ రూ. 45, రూ. 30, రూ. 15వేలు చొప్పున నగదు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితోపాటు సచివాలయాల్లో ఉత్తమ సేవలు అందజేసిన వారికీ సీఎం జగన్ సంతకంతో ప్రశంసా పత్రాలు, మెడల్స్, శాలువా తదితర వాటిని అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా, ఎన్నికల సమయంలో వలంటీర్ల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రభుత్వం ఇటువంటి చర్యలు చేపడుతున్నట్లు ప్రతిపక్ష పార్టీల నేతలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే జోన్- 8 పరిధిలో ఉన్న బీమిలి నియోజకవర్గంలో ఈ పంపిణీ కార్యక్రమం ముగిసింది. ఇంకా పెం దుర్తి, పశ్చిమ నియోజవర్గ పరిధిలో అధికార పార్టీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జిల అపాయింట్ మెంట్లు ఆధారంగా వీటిని పంపిణీ చేసేందుకు యుజీడీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.



వలంటీర్ల కోసం సిద్ధం చేసిన ధ్రువపత్రాలు, మెడల్స్, శాలువాలు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 22: విద్యార్థులు చదువుతోపాటు సమాజంలోని సమస్యల పట్ల అవగాహన పెంచుకోవాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కోరారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం ఆధ్వర్యంలో తుంగ్లాం కాలనీలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రదీప్‌కుమార్, ఎం.సత్యప్రకాశ్, బి.తిరుపతిరావు, శ్రీనివాస్, పాత్రుడు, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజల భవిష్యత్తు కోసం జగన్‌ను ఓడించాలి

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, ఫిబ్రవరి 22: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపాలని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ పేర్కొన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లోకి టీడీపీ మేనిఫెస్టోను తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అవినీతి, అక్రమాలు, కుట్రలతో ప్రజలను అన్ని విధాల తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి తగిన ప్రజలు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించేందుకు కార్యకర్తలు, కస్టర్, బూత్ ఇన్‌చార్జిలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పులి వెంకటరమణారెడ్డి, కోవిరి హరికృష్ణ, బలగ బాలునాయుడు, పెంటయ్య, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రోడ్డు ఆధునికీకరణ పనులు ప్రారంభం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 22: కాకతీయ జంక్షన్ నుంచి మహాత్మాగాంధీ కూడలి వరకు బీసీ రోడ్డు ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు పనుల కోసం జీవీఎంసీ రూ.రెండు కోట్లు మంజూరు చేసి, గత నెలాఖరున మేయర్ హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ మేరకు పెదగంట్యాడ జంక్షన్‌లో పనులు ప్రారంభమయ్యాయి. తొలుత ప్యాచ్ వర్క్‌లు పూరి చేశాక దానిపై ఒక లేయర్‌గా తారురోడ్డు వేస్తున్నారు. వారం రోజుల్లోగా పనులు పూర్తవుతాయని ఇంజనీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగానే పెదగంట్యాడ జంక్షన్‌లో కల్వర్టు నిర్మాణ పనులను పూర్తి చేశారు.



పనుల్లో నిమగ్నమైన కార్మికులు

కాపుజగ్గరాజుపేటలో బోరింగ్‌లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 22: 'కాపుజగ్గరాజుపేటలో దాహం కేకలు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'తో గురువారం ప్రచురితమైన కథనానికి తాగునీటి సరఫరా విభాగం అధికారులు స్పందించారు. కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్టు ఉన్నతాధికారులకు అందించారు. ఈ మేరకు ఈఈ కనకారావు, ఏఈ రాజ్ కుమార్ గురువారం కాపుజగ్గరాజుపేటకు చేరుకుని ప్రజల తాగునీటి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సిబ్బందితో మరమ్మతులకు గురైన రెండు బోరింగ్‌లను వినియోగంలోకి తెచ్చారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద జిమహేశ్, ఉరుకూటి శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులలో ఉచిత ప్రవేశాలు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 22: బీఎస్సీ పారా మెడికల్ కోర్సులలో బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు బీఎస్సీ రేడియోథెరపీ, కార్డియాక్ కేర్, ట్రాన్స్‌ఫ్యూషన్ టెక్నాలజీ, న్యూరో ఫిజియాలజీ, డయాలసిస్ వంటి కోర్సులలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 7995013421 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

టీడీపీ గెలుపుతో సమస్యల పరిష్కారం

- విశాఖ జిల్లా పార్లమెంటరీ ప్రధానకార్యదర్శి పాశర్ల ప్రసాద్



కార్మికులతో మాట్లాడుతున్న పాశర్ల ప్రసాద్

మల్కాపురం, ఫిబ్రవరి 22: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని టీడీపీ విశాఖ జిల్లా పార్లమెంటరీ ప్రధానకార్యదర్శి పాశర్ల ప్రసాద్ ప్రజలను కోరారు. గురువారం 59వ వార్డు మాజీ కాలనీ సమీపంలో ఉన్న లేబర్ జంక్షన్‌లో పలువురు కార్మికులను ఆయన కలిశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికులు నష్టపోయారని, విపరీతంగా ఇసుక, సిమెంట్ ధరలు పెంచేయడంతో నిర్మాణ పనులు నిలిచి కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం టీడీపీ విశాఖ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పాండ్రంగి జయరాజు నాయుడు మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల జీవితాలు బాగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సం ఘం కార్యదర్శి మదన్‌మోహన్, టీడీపీ నాయకులు బర్రె సూర్యప్రకాశ్, అప్పలరాజు, కాకర్ల రమణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పలు కోర్సుల్లో శిక్షణ

మల్కాపురం, ఫిబ్రవరి 22: మహిళలు పలు కోర్సులలో శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని కోరమాండల్ ఎరువుల కర్మాగారం డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 58వ వార్డు ఎదురువానిపాలెంలో మహిళలకు జూట్ బ్యాగ్‌ల తయారీపై శిక్షణను లెకా లెర్నింగ్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్మాగారం ఈహెచ్ఎస్ శాఖ నుంచి నాగర్జున , సీఎస్ఆర్ ప్రతినిధి వెంకటరమణ, గ్రామ పెద్దలు ఎదురుఅప్పలస్వామి, ఎదురురాజు, తొనంగి రమణిపాల్గొన్నారు.



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోరమాండల్ అధికారి శ్రీనివాసరావు

ఘనంగా శివ పార్వతుల కల్యాణం

గోపాలపట్నం, ఫిబ్రవరి 22: స్థానిక చంద్రనగర్ రజక కాలనీలోని శివాలయంలో గౌరీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్డు వైసీపీ అధ్యక్షు డు అయితంశెట్టి రేణుక గోపి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. కాలనీ సంఘ సభ్యులు బూబూరావు, త్రినాధ్, టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న వైసీపీ నేత గోపి

89వ వార్డులో ఆరోగ్య సురక్ష శిబిరం

గోపాలపట్నం, ఫిబ్రవరి 22: గ్రేటర్ 89వ వార్డు కొత్తపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపి, కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు ఈ శిబిరాన్ని సందర్శించారు. వైద్య నిపుణుల సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని రోగులకు సూచించారు. ఈకార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే పేదలకు సంక్షేమం

▸ దక్షిణ నియోజక వర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ



గ్రేటర్ 39వ వార్డులో ప్రచారం చేస్తున్న గండి బాబ్జీ, నాయకులు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 22: తెలుగుదేశం అధికారంలోకి వస్తే పేద, బడుగు వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని ఆపార్టీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ 39వ వార్డులో శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్‌లో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయనున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో పేద వర్గాలకు పూర్తి అన్యాయం జరిగిందన్నారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పార్టీ శ్రేణులు ఈ మేరకు ప్రచారంచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకుడు పోలయ్య, తెలుగు మహిళ నాయకులు, బూత్‌లెవెల్ కమిటీ నాయకులు, నందమూరి అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

జగన్ ముస్లింల పాలిట ద్రోహి: మహ్మద్ నజీర్

మహారాణిపేట: వైసీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం సామాజిక వర్గానికి సామాజిక వర్గం వంచనకు లోనైందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. గురువారం పార్టీ కార్యలయంలో ముస్లిం మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ ముస్లింల ద్రోహి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. బటన్ నొక్కుతూ ప్రజలను మోసగించడంలో ఆయన మాస్టర్ డిగ్రీ తీసుకున్నారని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన పాలనలో ముస్లింలను ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎంతో ఆదుకున్నారన్నారు. ఆయన హయాంలో కల్యాణ మస్తు, షాదీతోఫా పథకాల ద్వారా 98 వేల కుటుంబాలకు రూ. 307 కోట్లు ఇచ్చారన్నారు. పెళ్లి రోజే కల్యాణ మండపంలోనే వధువుకు రూ. 50 వేలు అందించినట్లు ఆయన గుర్తుచేశారు. జగన్ అనేక నిబంధనలతో కేవలం 50 వేల కుటుంబాలకు మాత్రమే ఈ పథకం పరిమితం చేశారని తెలిపారు. ఈసమా వేశంలో ముస్లిం నాయకులు అబ్దుల్ చిన రహమాన్ అబ్దుల్ ఆసీఫ్ జఫ్రుల్లా, షేక్ రహ్మతుల్లా, మహ్మద్ గౌస్ అబ్దుల్ గఫూర్, రఫీ, కాలీషా, యాసీన్ , బాషా, నజర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వృక్ష శాస్త్రంపై జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సులో పాల్గొన్న ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 22: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఐక్యూఏసీ సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. ముఖ్య అతిథులు ఏయూ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రం సహ సంచాలకులు డాక్టర్ పీవీకే జగన్నాధరావు హాజరయ్యారు. వృక్షశాస్త్రంలో ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అన్న అంశంపై ప్రసాద్‌రెడ్డి, పంట అనంతర దిగుబడిలో నష్టనివారణకు సాంకేతిక నైపుణ్యాలపై జగన్నాధరావులు ప్రసంగించారు. వ్యవసాయం, బయోటెక్నాలజీ, హెర్బల్ టెక్నాలజీ, ఫార్మసీ, బయోడైవర్సిటీ కన్సర్వేషన్, వాతావరణ మార్పులు, గ్రీన్ టెక్నాలజీస్ తదితర ఆరు ఇతి వృత్తాలతో ఈసదస్సులో చర్చిస్తామని కన్వీనర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ పద్మ సుందరి, సిస్టర్‌హేమ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ పికే జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి: యూటీఎఫ్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వంఇవ్వాల్సిన రూ.20వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ బకాయిలపై ఏపీజేఏసీ ఆధ్వర్యంలో తాలుకా, జిల్లాస్థాయిలో ధర్నాలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిమాండ్ల సాధన కోసం ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం ఉన్న సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను చర్చలకు ఆహ్వానించారన్నారు. ఒక్క పక్క చర్చలకు ఆహ్వానిస్తూనే చలో విజయవాడను ఉక్కు పాదంతో అణచి వేయడానికి ముందస్తు అరెస్టులకు పాల్పడుతూ, ఎక్కడికక్కడ పోలీసులు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ద్వంద్వ వైఖరి విధానాలను వీడి ఉద్యోగుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22: సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ,అండమాన్ నికోబార్ ప్రాంతీయ వనరుల కేంద్రం, స్నేహ సంధ్య ఏజ్‌కేర్ ఫౌండేషన్ సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సును ప్రేమ సమాజంలో నిర్వహించింది. దేశంలో 60 ఏళ్ల పైబడిన 160 మిలియన్ల మంది జనాభా పెరుగుతున్న నేపథ్యంలో వారి అవసరాలను తీర్చడానికి సమగ్ర వ్యూహాల అవసరాల ప్రాధాన్యంపై ఈ సదస్సును ప్రారంభించారు. హెరిటేజ్ ఫౌండేషన్ ఛైర్మన్ కె.ఆర్.గంగాధరన్ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఏజ్‌కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డా.ఎన్.ఎస్.రాజు మాట్లాడుతూ సదస్సు వృద్ధుల సమస్యలపై అవగాహన పెంచడానికి వారికి సాయం చేయడానికి ఒక వేదిక చేయూతగా నిలుస్తుందన్నారు. సదస్సులో వృద్ధుల ఆరోగ్యం, ఆర్థిక భద్రత, దుర్వినియోగం, సంరక్షణ వంటి అంశాలపై నిపుణులు చర్చించారు.

ఎన్నికల ముందు రోడ్ల అభివృద్ధి గుర్తుకు వచ్చిందా?

▸ జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్



జనంలోకి జనసేనలో మాట్లాడుతున్న ఉషాకిరణ్

కంచరపాలెం, ఫిబ్రవరి 22 : నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నగరాభివృద్ధిని పట్టించుకోకుండా మరి కొద్దిరోజుల్లో ఎన్నికలు వస్తున్న సమయంలో వీధి వీధికి రోడ్లు వేస్తుండడం హాస్యాస్పదంగా ఉందని ఉత్తర నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ విమర్శించారు. జీవీఎంసీ 55వ వార్డు పరిధి జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా దీప్తి ఆసుపత్రి, కంచరపాలెం హైవే తదితర ప్రాంతాల్లో ఆమె పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోడ్లుకు మరమ్మతులుగాని, నూతన రోడ్లు ఎక్కడా వేసిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో రోడ్ల దుస్థితి ఇప్పుడు గుర్తుకు వచ్చినట్టుందని విమర్శించారు. ముఖ్యమంత్రి నగరానికి వచ్చిన ప్రతిసారీ మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు. సీఎం సభకు రావాలని మహిళలను బెదిరించి బలవంతంగా తీసుకువెళ్లి మండుటెండల్లో సైతం నిలబెడుతున్నారన్నారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మేరుగు నూకరాజు, యల్లాజీ, నవీన్, వర్మ, వెంకటేష్, రంజిత్ పాల్గొన్నారు.

'అడ్డంకులు అధిగమిస్తేనే జీవితంలో రాణింపు'



స్కాలర్‌షిప్‌ల ప్రదానంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తదితరులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22: చదువు విషయంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని అధిగమించి ముందుకుసాగితేనే జీవితంలో మంచి స్థాయికి చేరుకోగలరని వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా 189 మంది విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, దిశా సీఐ కల్యాణి, ఏవీఎన్ వుమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ హాజరై జ్యోతి ప్రజల్వనగావించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చునన్నారు. ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలని సూచించారు. తద్వారా దేశాభివృద్ధిలో కీలకం కావాలన్నారు. సంకల్ప బలం ఉంటే పేదరికం అడ్డుకాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ ఫేబిన్, మేనేజర్ కె. సునీత , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేవీలో థింకింగ్ డే ఉత్సవాలు



వేడుకలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 : స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు లార్డ్ స్టీవెన్ సన్ బాడెన్ పౌల్, లేడీ బాడేన్ పౌల్ జయంతి సందర్భంగా తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం ప్రపంచ థింకింగ్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్ బాడెన్ లార్డ్ పౌలు దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్కౌట్ ఉద్యమం గొప్పతనాన్ని వివరించారు. అలాగే సంగీత ఉధ్యాయుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు సర్వధర్మ ప్రార్థనలు చేశారు. వజ్జా మణిబాబు ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బీఎస్ మీనా, హెచ్‌ఎం శైలజ, అధ్యాపకులు విజయలక్ష్మి, షాహ్లా సబ్రీన్, సత్యనారాయణ, కుందన్‌లాల్, మిట్టపల్లి రేఖ పాల్గొన్నారు.

25న శ్రీకృష్ణ దేవరాయ, రంగా విగ్రహాల ఆవిష్కరణ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22: శ్రీకృష్ణ దేవరాయ , వంగవీటి మోహనరంగా విగ్రహాలను గోపాలపట్నం పద్మనాభ నగర్‌లో ఈనెల 25న ఆవిష్కరించనున్నట్టు శ్రీ కృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండ్రెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కంపర సత్తిబాబు , గౌరవ సలహాదారు గంట్ల శ్రీనుబాబు తెలిపారు .గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.కార్యక్రమానికి వైసీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, బొత్స ఝాన్సీ తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు.ఈ సమావేశంలో కె.కోటేశ్వరరావు ఎ.రాజశేఖర్, కె.నాగరాజు, డి.మోహన్, జి.మురళీకృష్ణ, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయుడు



దయాబాను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 : టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయులవసతి గృహంలో ఆశ్రయంపొందుతున్న దయాబా (50)ని ఒడిశాలోని సుందర్‌ఘడ్ జిల్లా మెయిడాలోని సవిందపూర్‌గ్రామంలో ఉన్న సోదరుడుకి శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు అప్పగించినట్లు వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. గతేడాది ఆగస్టులో నగరంలోని ఫుట్‌పాత్‌పై దయనీయ స్థితిలో ఉన్న ఆయనను రెస్క్యూ చేసి మానసిక ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించామన్నారు. ఆయన కోలుకోవడంతో పేరు, వివరాలు చెప్పారన్నారు. దీంతో దయాభాను గురువారం శ్రద్ధాఫౌండేషన్ ప్రతినిధులు ఆయన సోదరుడివద్ద చేర్చారు.

పథకాల పంపిణీలో వలంటీర్లు కీలకం



సన్మానం పొందిన వలంటీర్లు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని వైసీపీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపుఆనంద్ అన్నారు. డాబాగార్డెన్స్ డ్వాక్రాబజార్‌లో గురువారం వలంటీర్స్‌కు అభినందన సభలో ఆయన మాట్లాడారు.వార్డు పరిధిలోని ఆరు సచివాలయాల వలంటీర్లకు సేవా పురస్కారాలను అందజేశారు. సచివాలయ సిబ్బంది ఆర్‌పీ వరలక్ష్మి, కన్వీనర్ కొండ భవాని, గారి రాంబాబు, బాబూరావు, కందిరేగుల నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి: గంటా

సీతమ్మధార, ఫిబ్రవరి 22: టీడీపీ గెలుపునకు కృషి చేయాలని మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్టీకి విశేష సేవలందిస్తున్న 14వ వార్డు నాయకుడు గొంప ధర్మారావును అభినందించారు. ధర్మారావుబలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. ఆయనను సన్మానించారు.

ఇందిరా ప్రియదర్శిని స్టేడియం మరమ్మతులు పూర్తిచేయండి

▸ జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ



స్టేడియంను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం మరమ్మతు పనులను సత్వరం పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ ఆదేశించారు. స్టేడియం ఆధునికీకరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అతిపెద్ద స్టేడియంగా గుర్తింపు పొందిన ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో త్వరలో జాతీయ, అంతర్జాతీయ క్రీడలు జరుగనున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అప్పటికి అంతా సిద్ధం చేయాలన్నారు. గ్యాలరీలకు ఆనుకుని ఉన్న హాళ్లు, గదుల్లో ఇండోర్ గేమ్స్‌కి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం దొండపర్తి నుంచి జాతీయరహదారి వరకూ అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్ పనులను పరిశీలించారు.

కలెక్షన్ కింగ్ ఉక్కు అధికారి!

▸ రోజువారి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు

▸ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 22: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఎలాంటి వ్యాపారం చేయాలన్నా అందుకు ఉక్కు యాజమాన్యం అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కొన్ని నిబంధనల మేరకు వ్యాపారాలకు ఉక్కు ఉన్నతాధికారులు అనుమతివ్వడం జరుగుతుంది. అయితే ఉక్కుటౌన్ అడ్మిన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి మాత్రంఅలాంటి అనుమతి పత్రం లేకుండానే చిరు వ్యాపారాలు సాగించేందుకు మౌఖికంగానే అనుమతిస్తూ వారినుంచి రోజువారి కలెక్షన్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలువెల్లువెత్తుతున్నాయి. దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టు జంక్షన్ కూడలి నుంచి గాజువాక కణితి మార్గంలోని చెక్‌పోస్టు వరకు గల స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గంలో ఎక్కడపడితే అక్కడ చిన్నచిన్న వ్యాపారాలు సాగుతున్నాయి. ఇవన్నీ అనధికారికంగానే నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వీటిని నియంత్రించాల్సిన ఓ ఉక్కు అధికారి నిబంధనలకు విరుద్ధంగా చిరువ్యాపారుల నుంచి రోజువారి కలెక్షన్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి ఉదయంఓ మార్గంలో, సాయంత్రం వేళల్లో వేరే మార్గంలోనూ అనధికారిక వసూళ్లకు పాల్పడుతున్నట్టు పలువురు ఉక్కు కార్మికులు, చిరు వ్యాపారులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. అయితే వీటికి అడ్డుకట్ట చేయాల్సిన ఉన్నతాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రధానంగా స్టీల్‌ప్లాంట్ కణితి జంక్షన్ నుంచి చెక్‌పోస్టు వరకు ఎంతోమంది తమ వ్యాపారాలను అనధికారికంగానే కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరైనా కొత్త వ్యక్తి రోడ్డు పక్కన వ్యాపారం చేస్తే వారినుంచి తొలి సారిగా అధిక మొత్తంలో మామూళ్లు వసూలు చేయడం, ఆ తర్వాత రోజువారి కలెక్షన్లకు పాల్పడుతున్నట్టు సమాచారం. ఎవరైనా వ్యాపారి ఒకరోజు మాములు చెల్లించకపోతే ఆ మర్నాడు రెండు రోజులకు కలిపి నగదు చెల్లించాల్సి వస్తుందని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కాగా టౌన్‌షిప్‌లోని ప్రధాన జంక్షన్‌లలో టిఫిన్ సెంటర్‌లకు గతంలో అనుమతి ఇచ్చారు.కొంతకాలం తర్వాత వాటికి అనుమతులు రద్దు చే యడంతోపాటు వాటర్ కనెక్షన్లకు కట్ చేశారు. అయినా టిఫిన్ సెంటర్ల నిర్వా హ కులు అక్కడనుంచి వెళ్లకుండా తమ వ్యాపారాలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇవన్నీ సదరు అధికారికి తెలిసినప్పటికీ మామూళ్ల మత్తులో పడి నిబంధనలకు నీళ్లొదిలి ముందుకు సాగుతున్నారు. సదరు అధికారిపై ఉక్కుఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 22: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం సీతంపేట విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సీతంపేట మెయిన్ రోడ్డు, విజయ ఆసుపత్రి ప్రాంతం, గురుద్వారా ప్రాంతం, సీతంపేట, శాంతిపురం, జీవీకే ప్లాజా, రమా ఆసుపత్రి, రిలయన్స్ పెట్రోల్ బంక్ ప్రాంతం, సీతమ్మధార కేన్సర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలన్నారు.

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. కైలాసపురం, సత్యసాయి నగర్, సింగాలమ్మపురం ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంచరపాలెం, ఫిబ్రవరి 22 : జీవీఎంసీ 48వార్డు ఇందిరానగర్-3లో రూ. 26 లక్షలతో నూతన సామాజిక భవన నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఉత్తర వైసీపీ సమన్వయకర్త కె.కె.రాజు, వార్డు కార్పొరేటర్ గంకల కవిత పనులను ప్రారంభించారు ఊర్వశి జంక్షన్ నుంచి బర్మా క్యాంపు వరకు నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. వైసీపీ వార్డు ఇన్‌చార్జి నీలిరవి, గంకల అప్పారావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 43వ వార్డు వేంకటేశ్వర కాలనీలో రూ.57.70 లక్షల వ్యయంతో నిర్మించిన సామాజిక భవనాన్ని కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు ప్రారంభించారు. నాయకులు దుప్పలపూడి శ్రీనివాస్, కాయల శ్రీనివాస్, కాయల పోలీస్, పులపా రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన నేవీ సంబరం

... 5వ పేజీ తరువాయి

చేస్తూ దూసుకొచ్చిన జెట్ విమానాలు మిరుమిట్లు గొలిపే బాంబుల వర్షాన్ని కురిపించాయి. సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఉపయోగించే చేతక్ హెలికాప్టర్లు వేదిక ముందు అతిథుల ఎదుట అతి తక్కువ ఎత్తులో ఎగురుతూ సయ్యాటలాడాయి. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమం...జాతీయ పతాకంలోని మూడు రంగులు సముద్రంలో నుంచి పైకి ఎగిసేలా పేల్చిన బాంబులతో మొదలైంది. బీచ్‌లో బందీలను విడిపించడానికి కమెండోలు జెమినీ బోట్లపై వచ్చి చేసిన దాడి యుద్ధ రంగాన్ని తలపించింది. ఆకాశంలో ఎనిమిది వేల అడుగుల ఎత్తున ఎగురుతున్న హెలికాప్టర్ నుంచి ఒకరి తరువాత మరొకరుగా దూకిన మెరైన్ కమెండోలు వేదిక ముందు సురక్షితంగా దిగి ముఖ్య అతిథికి జ్ఞాపికను బహూకరించిన సాహస కార్యం అందరినీ కట్టిపడేసింది. మిగ్ 29కు యుద్ధ విమానాల గర్జన చెవులను హోరెత్తించింది. కొత్తగా నౌకాదళంలో చేరిన సీ హాక్ హెలికాప్టర్లు, దేశీయ తయారీ తేజస్ యుద్ధవిమానం విశాఖ ప్రజల ముందు ప్రత్యక్షమయ్యాయి. నిఘా విమానాలు డార్నియర్లు, బోయింగ్‌తో తయారైన పీ8ఐ నిఘా విమానం సముద్ర రక్షణకు మేమున్నామని చాటాయి. విమాన వాహక నౌకలు విక్రాంత్, విరాట్‌లు వేదికకు ఎదురుగా సముద్రంలో కొలువుదీరాయి.

కలర్‌ఫుల్ పెరేడ్

మిలాన్‌కు హాజరైన 51 దేశాల ప్రతినిధులు వారి జాతీయ పతకాలను చేబూని ఒకరి తరువాత మరొకరు కవాతు చేసుకుంటూ వచ్చిన దృశ్యం ప్రపంచం మొత్తం విశాఖలోనే ఉందా?...అనిపించింది. నేవీ స్కూల్ చిన్నారులు, కోరుకొండ సైనిక్ స్కూల్ పిల్లలు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బంగ్లాదేశ్, శ్రీలంక, వియత్నాం, రష్యా, ఇరాన్, మారిషస్, ఫ్రాన్స్ తదితర దేశాలతో పాటు ఏపీ పోలీస్, కోస్టుగార్డు, ఏపీ పోలీస్ బ్యాండ్, నేవీ బ్యాండ్ బృందాలు పాల్గొన్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్ విశాఖ ప్రజలను ఉద్దేశించి కొద్దిసేపు మాట్లాడారు. కార్యక్రమంలో తూర్పు నౌకాదళం చీఫ్ రాజేశ్ పెంధార్కర్, మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరికుమారి, కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్, నేవీ కుటుంబాలు, నగర వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.

ఈవెనింగ్ క్లినిక్స్ మూన్నాళ్ల ముచ్చటేనా!?

... 5వ పేజీ తరువాయి

ఈవినింగ్ క్లినిక్స్ నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ఆంధ్ర మెడికల్ కళాశాలలోని బోధనాస్పత్రుల్లో ఈ మేరకు ఏర్పాట్లు చేసిన అధికారులు కొద్దిరోజులపాటు క్లినిక్స్ నిర్వహించారు. కానీ, ఏం జరిగిందో తెలియదు కానీ ప్రస్తుతం బోధనాస్పత్రుల్లో ఈవినింగ్ క్లినిక్స్ నడవడం లేదు. ఈవినింగ్ క్లినిక్స్ నిర్వహించాల్సిన గదులకు తాళాలు వేసి ఉంటున్నాయి. సాయంత్రం క్లినిక్స్ నిర్వహిస్తే ఉదయం పూట ఓపీలో ఒత్తిడి తగ్గుతుంది. కానీ, ఈవినింగ్ క్లినిక్స్ నిర్వహించేందుకు వైద్యులు ఆసక్తి చూపించడం లేదు. ఉన్నతాధికారులు కూడా వారిపై ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారు. దీంతో ఒకవేళ ఎవరైనా రోగులు రిపోర్టులు తీసుకుని వైద్యుల వద్దకు వెళ్లానుకుంటే ఆయా విభాగాలకు వెళ్లాలని చెబుతున్నారు. అక్కడ సీనియర్ వైద్యులు ఉండడు. దీంతో చేసేది లేక మరోరోజు ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది.

రోగులు రావడం లేదంటున్న అధికారులు

ఈవినింగ్ క్లినిక్స్ గురించి ప్రజలకు అవగాహన లేకపోవడం, పరీక్షల రిపోర్టు అదేరోజు ఇచ్చే అవకాశం లేకపోవడంతో సాయంత్రం వేళ వస్తున్న రోగుల సంఖ్య తక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. కేజీహెచ్‌లో ఆయా విభాగాల్లో వైద్యులు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని, సాయంత్రం వేళ ఎవరైనా వస్తే చూస్తున్నారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. విమ్స్‌లోనూ ఈవినింగ్ క్లినిక్స్ నిర్వహిస్తున్నామని, రోగులు ఐదారుగురికి మించి రావడం లేదని డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. జనరల్ మెడిసిన్ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు

... 5వ పేజీ తరువాయి

లీలానాగవల్లి 20, సుండి సుజాత 15, కె.యశ్వంతరావు 12, కాండ్రేగుల సత్తిబాబు 11, బత్తుల రంగనాయకమ్మ, రొంగలి సుధ ఏడు దరఖాస్తులు సమర్పించినట్టు తేలడంతో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మరో 13 మందిని గట్టిగా హెచ్చరించాలని నిర్ణయించారు.

ఆ మేరకు పది మందిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంది. కానీ ఆ పది మంది అధికార పార్టీకి చెందినవారు కావడంతోనే ఇప్పటివరకూ కేసులు నమోదు చేయడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ స్వయంగా సిఫారసు చేసినా పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆ పది మందిని కాపాడుకోవాలని వైసీపీ నేతలు నిర్ణయించినందునే పోలీసులు ముందుకువెళ్లడం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడానికి విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సిద్ధమవుతున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్టు వెల్లడించారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

9వ వార్డులో ఎంపీ పాదయాత్ర

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 22 : ప్రజా సమస్యలు తెలుసుకుని, వారితో మమేకం కావడానికే పాదయాత్ర చేపడుతున్నానని వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన 9 వార్డులోని రామాలయం వీధి, ఎస్సీ, ఎస్టీ కాలనీ, విశాలాక్షినగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయడానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ స్వాతిదాస్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 18 వార్డు ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో ఉన్న వాసుపల్లి పెద్ద పైడయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గురువారం పరామర్శించారు. ఆయనతో పాటు మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ ఓదార్పు యాత్ర ప్రారంభం

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 22 : రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులను ఓదార్చేందుకు ఏపీ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఎంవీపీ కాలనీలో ఓదార్పు యాత్ర ప్రారంభమైంది. గత హామీల ప్రకారం ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ యాత్ర చేపడుతున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడతూ నిరుద్యోగ యువతను ప్రత్యక్షంగా కలిసి వారి ఆవేదనను ప్రభుత్వం, రాజకీయ పార్టీల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 22 : భీమిలి జోన్ పరిధిలోని 33 కేవీ ఆనందపురం-కళింగ, 33 కేవీ ఆనందపురం-భీమిలి, 11 కేవీ వెల్లంకి, 11 కేవీ వేములవలస ఇండస్ట్రియల్, 11 కేవీ భీమిలి టౌన్, 11 కేవీ పాలిటెక్నిక్ ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జేవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, చిన్నబజారు, కీటిన్‌పేట, బ్యాంక్ కాలనీ, ఎల్లమ్మపేట, మహాలక్ష్మీపురం, డెక్కతిపాలెం, రాజలింగంపేట, రేఖవానిపాలెం, రాయపాలెం, మరడపాలెం, మామిడిపాలెం, శైలేంద్ర అపార్ట్‌మెంట్ ఏరియా, మూలకుద్దు, స్మిత్ స్ట్రీట్, జగనన్న కాలనీ, నేరెళ్లవలస, కృష్ణాకాలనీ, బిల్లలమెట్ట పరిసర ప్రాంతాలకు విద్యుత్ ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

కొమ్మాదిలో..

కొమ్మాది : కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సేవానగర్, 11 కేవీ కొమ్మాది ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ నరేష్ తెలిపారు. కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతికాలనీ, సేవానగర్, డ్రైవర్స్ కాలనీ, కొమ్మాది విలేజ్, దేవీమెట్ట, ఓజోన్ వేలీ, కుక్కల కంపెనీ, ఓజోన్ వేలీ రోడ్డు తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : మండలంలోని బోని 33/11 కేవీ, 11 కేవీ శిర్లపాలెం, సామయ్యవలస, పాండ్రంగి ఫీడర్ల మరమ్మతు పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిపివేయనున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. అనంతవరం, గంధవరం, కొవ్వాడ, శిర్లపాలెం, పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపాలెం గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 20, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 48, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 55, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 20, క్యారేట్ 20, దొండకాయలు 38, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 105, బరబటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 215, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 34, కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	125
ఫారం ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఎన్నికల హామీగా మిగిలిన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు

- ప్రమాదాల సమయంలో అపార నష్టం
- స్పందించని పాలకులు, అధికారులు

మధురవాడ, ఫిబ్రవరి 22 : మధురవాడ పరిసరాల్లో అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ప్రమాదాలు జరిగినపుడు తీవ్ర నష్టం కలుగుతోంది. మధురవాడలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని గతంలో ఎందరో ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు నెరవేరలేదు. ప్రమాదాలు జరిగే ఇటు నగరం నుంచి లేదా తగరపువలస సమీపంలో ఉన్న తాళ్ళవలస నుంచి అగ్నిమాపక శకటాలు వస్తున్నాయి. ఈ రెండు కేంద్రాలు మధురవాడకు దూరంగా ఉండడంతో ప్రమాదాల సమయంలో అపార నష్టం వాటిల్లుతోంది. గతంలో కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్ళపాలెం, మల్లయ్యపాలెం, నగరంపాలెం తదితర ప్రాంతాల్లో పలుమార్లు అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో అప్పట్లో కొన్ని ఇళ్లు పూర్తిగా ఆహుతయ్యాయి. ఆస్తినష్టం కూడా ఎక్కువగా జరిగింది. గత ఏడాది డిసెంబరులో వాంబే కాలనీలో ఒక ఇంట్లో గ్యాస్ లీకై ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ సంఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

స్థానికులకు శిక్షణ ఇవ్వాలి

మధురవాడ పరిసరాల్లో వందల సంఖ్యలో బహుళ అంతస్థుల భవనాలు ఉన్నాయి. అన్నిచోట్లా అగ్నిమాపక నియంత్రణ ఏర్పాట్లు ఉండడం లేదు. అలాగే ఆస్పత్రులు, పాఠశాలల వద్ద తప్పనిసరిగా అగ్నిని నిరోధించే పరికరాలు ఉండాలి. కొన్ని సంస్థలు మాత్రమే నిబంధనలు పాటిస్తున్నాయి. ఈ క్రమంలో స్థానిక యువతకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ప్రభుత్వం శిక్షణ ఇస్తే అనుకోని దుర్ఘటనలు జరిగినప్పుడు కొంతవరకు శిక్షణ పొందిన యువకులు ఆపదలో ఉన్నవారిని రక్షించగలరు. ఆ దిశగా పాలకులు, అధికారులు, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తాళ్ళవలస వద్ద ఉన్న అగ్నిమాపక కేంద్రం

అప్పన్నకు జర్నలిస్టుల వినతి

సింహాచలం, ఫిబ్రవరి 22 : జర్నలిస్టులపై దాడి చేస్తున్న వైసీపీ మూకలకు మంచి బుద్ధి కల్పించాలని కోరుతూ వరాహలక్ష్మీనృసింహస్వామికి జర్నలిస్టులు గురువారం వినతిపత్రం సమర్పించారు. తొలుత సింహాచలం,పెందుర్తి ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు తమ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని కొండదిగువ తొలిపావంచా వద్ద ఉన్న స్వామి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు. అనంతరం దాన్ని హుండీలో వేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు గుసిడి అవినాష్‌బాబు, రౌతు రాంబాబు, జనసేన నేత మజ్జి సూరిబాబు, సీఐటీయూ నేత కృష్ణంరాజు, వీహెచ్‌పీ నేత పూడిపెద్ద శర్మ మాట్లాడుతూ మీడియాను పథకం ప్రకారం అణగతొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఆంధ్రజ్యోతి జర్నలిస్టులు, ఈనాడు కార్యాలయంపై వైసీపీ గూండాలు చేసిన దాడిని ఖండిస్తున్నామని చెప్పారు.

సీబీఐతో విచారణ జరపాలి

జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై కేంద్రం సీబీఐతో విచారణ జరిపించాలని జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, ప్రభుత్వం అంతా తాము చెప్పినట్టే జరగాలని, తాము చెప్పిందే రాయాలని, చెప్పిందే వినాలన్న ధోరణిలో ప్రవర్తిస్తోందన్నారు. రాజ్యాంగమిచ్చిన హక్కులను కూడా హరిస్తోందన్నారు. ఇదే సమయంలో కొందరు అమాయక జర్నలిస్టులపై దాడులకు తెగబడుతోందని, దీంతో వారి కుటుంబ సభ్యులు కూడా అభద్రతా భావానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టెర్రరిజంపై కేంద్రం విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

జనసేన భీమిలి అసెంబ్లీ ఇన్‌ఛార్జి సందీప్

పద్మనాభం, ఫిబ్రవరి 22 : అరాచక పాలనతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలని జనసేన భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన అయినాడ, యాతపేట, సత్యనారాయణపురం, బీఆర్ తాళ్లవలస, బొత్సపేట, లింగన్నపేట, బుడ్డివలస, బుడ్డివలస అగ్రహారం, నేరేళ్లవలస, కొయ్యపేట, చిన్నాపురం గ్రామాల్లో పల్లెయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలవుతున్న పథకాలను కొనసాగిస్తూనే, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకున్నా ప్రతి ఒక్కరికి రూ. 15 వేలు చొప్పున చెల్లిస్తామన్నారు. అలాగే ప్రతి గృహానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని, స్థానిక సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లీలావతి, నాయకులు నగేష్‌కుమార్, జనసేన మండల అధ్యక్షుడు రామస్వామి నాయుడు,నాయకులు సారధి, సూరప్పడు, పాల్గొన్నారు.



అయినాడలో పల్లెయాత్ర చేస్తున్న జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్



రెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

'ఎన్‌ఎస్‌ఎన్ రెడ్డి సేవలు మరువలేం'

సిరిపురం, ఫిబ్రవరి 22 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన వ్యక్తి విశాఖ ప్రథమ మేయర్ ఎన్‌ఎస్‌ఎన్ రెడ్డి అని వక్తలు కొనియాడారు. గురువారం జీవీఎంసీ గాంధీ పార్కులోని రెడ్డి 94వ జయంతి నిర్వహించారు. ముందుగా పలువురు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధిలో రెడ్డి పాత్ర ఎంతో కీలకమన్నారు. మేయర్‌గా, ఎమ్మెల్యేగా విశాఖ అభివృద్ధిలో తనదైన పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, నీలాపు విజయానందరెడ్డి, ఎస్‌వీఎస్ ప్రకాష్ రెడ్డి, సీనియర్ నాయకులు సిరపు అప్పలరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎం. సాయికుమార్, ఎస్. చంద్రకాంత్‌రెడ్డి, టి. సుబ్బరామిరెడ్డి, వేమన సంక్షేమ సంఘం సభ్యులు ఎన్‌వీ రమణారెడ్డి, డి. రామకృష్ణారెడ్డి, పి.సూర్యనారాయణ, కె.రామ్‌కుమార్, డి.అప్పలరాజు, ఎ.శంకరరావు, కె.మహేష్, ఎం.శాలివాహన్, ఎన్.గంగాధర్ యాదవ్, ఎస్. వెంకటేశ్వర్లు, డీడీవీఎస్‌ఎన్ స్వామి, ఎస్. రాజు పాల్గొన్నారు.

సాంఘిక ఉద్యమకారుడు జయగోపాల్

ఆరిలోవ, ఫిబ్రవరి 22 : భారత నాస్తిక సమాజ, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ మానవ హక్కుల నేత, సాంఘిక ఉద్యమకారుడు డాక్టర్ జయగోపాల్ సంస్మరణ సభ ఈనెల 25న డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్నట్టు కేంద్ర కమిటీ సభ్యుడు జె. రవి తెలిపారు. గురువారం ఆయన ఆరిలోవలోని నాస్తిక సమాజం కేంద్ర కార్యాలయంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జయ గోపాల్ ఈనెల 7న మృతి చెందారని, ఆయన తన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి, పార్థివదేహాన్ని కేజీ హెచ్ మెడికల్ కళాశాల విద్యార్థులకు ఇచ్చి ఆదర్శంగా నిలిచారన్నారు. జయప్రకాష్ భానాసాను స్థాపించడమే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా 52 ఏళ్లు అనేక ఉద్యమాలు చేశారని చెప్పారు.

చంద్రంపాలెంలో ఉచిత వైద్య శిబిరం

మధురవాడ, ఫిబ్రవరి 22 : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని చంద్రంపాలెంలో జేఏఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పలువురికి రక్తపరీక్షలు చేసి మందులు అందించారు. అలాగే కొందరికి నేత్ర పరీక్షలు జరిపి, శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు.

ఘనంగా నిత్యానంద త్రయోదశి

సాగర్‌నగర్, ఫిబ్రవరి 22 : సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో నిత్యానంద త్రయోదశి గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలోని దేవతామూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు మధ్యాహ్నం వరకు ఉపవాసం ఉండి నిత్యానంద ప్రభువు ఆశీస్సులు పొందారు. ముందుగా శ్రీనితాయ్‌గౌ రంగ ప్రభువులు పంచామృత అభిషేకాలతో పూజలు జరిపారు. అనంతరం భజనలు, సంకీర్తనలు నిర్వహించారు.అలాగే ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయిసేవనిల ప్రవచనాలు, వంద కిలోల పుష్పాలతో దేవతామూర్తులకు పుష్పాభిషేకాలు చేశారు.



అలంకరణలో దేవతామూర్తులు

ఆనందపురంలో...

ఆనందపురం : ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ వైకుంఠం ఆవరణలో హరేకృష్ణ మూవ్మెంట్ ఆధర్యంలోనూ నిత్యానంద త్రయోదశి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ద్వాపరయుగంలో బలరాముడే నిత్యానంద ప్రభువుగా అవతరించారని పేర్కొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి

మధురవాడ, ఫిబ్రవరి 22 : క్షయ నివారణ కోసం ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని మధురవాడ పీహెచ్‌సీ టీబీ యూనిట్ పర్యవేక్షకుడు వి. వీర్రబ్రహ్మం అన్నారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరు లతో మాట్లాడారు. వ్యాక్సిన్ అందించడం కోసం అన్ని వార్డు సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహించామని, ఏడాది నుంచి 18 ఏళ్ల వయసున్న షుగర్ వ్యాధిగ్రస్తులకు టీకా వేస్తామన్నారు. అలాగే రెండేళ్ల నుంచి 60 ఏళ్లు పూర్తయిన వారికి కూడా టీకా అందించనున్నట్టు చెప్పారు. 2018 నుంచి 2022 వరకు క్షయ మందులు వాడిన వారు కూడా టీకా వేయించుకోవచ్చునన్నారు. టీకా అన్ని ఆస్పత్రుల్లో ఉచితంగా లభిస్తుందన్నారు.

మాతృభాషపై ముగిసిన సదస్సు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 22 : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం పురస్కరించుకుని ఏయూ తెలుగు విభాగం, సమైక్య భారతి, ఆంధ్ర భవన్ (ప్రైమరీ అండ్ హయ్యర్ సెకండరీ స్కూల్) సంయుక్త నిర్వహణలో తెలుగు విభాగ సమావేశ మందిరంలో రెండు రోజులుగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం - తెలుగు భాషా విశిష్టత అన్న అంశంపై జరుగుతున్న సదస్సు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. నరసింహారావు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను మాతృభాష ద్వారానే కాపాడుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ కేవలం మార్కుల కోసమే తెలుగు భాషను చదుకోకూడదని మానవ వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష దోహదపడుతుందని, విద్యార్థులు దీన్ని గుర్తెరగాలని సూచించారు. హైదరాబాద్ రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ రేవూరు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు చదివిన వారికి ఉద్యోగావకాశాలు ఇబ్బడిముబ్బిడిగా ఉన్నాయని, అయితే తప్పులు లేని తెలుగు కావాలన్నారు. డాక్టర్ బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.



'ఓటుహక్కు సద్వినియోగం చేసుకోండి'



సదస్సులో మాట్లాడుతున్న అడ్వకేట్ జనార్దనరావు

భీమునిపట్నం, ఫిబ్రవరి 22 : ప్రతిఒక్కరూ విచక్షణ జ్ఞానంతో ఓటు హక్కును వినియోగించుకోవాలని భీమిలి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, అడ్వకేట్ నెయిగాపుల జనార్దనరావు అన్నారు. గురువారం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఓంకారేశ్వర ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సహకారంతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ధనికులు, నేరచరితులు, బడా వ్యాపారులు కేవలం ధన బలంతో ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టి నాయకులై పోతున్నారన్నారు. దీనివల్ల భవిష్యత్ తరాలవారు అంధకారంలో, అరాచకంలో జీవించేలా మనమే చేస్తున్నామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని గ్రహించి, నిజాయితీపరులకు ఓటు వేయాలని తెలి పారు. ఓంకారేశ్వర ఆధ్యాత్మిక పీఠం అధ్యక్షుడు పల్లా భరత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భీమిలి ఏపీజీవీజీ బ్యాంక్ బీఎం జయంతి వేద ప్రభాస్, ఆయుర్వేద వైద్యులు సత్తరపు వాయునందనరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, కళాశాల పూర్వ విద్యార్థి పల్లా నోవజ్ఞ, సమాజ సేవకులు కంటుభుక్త శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు మద్దతు ధర పెంపు హర్షనీయం

పెదవాల్తేరు, ఫిబ్రవరి 22 : చెరకు మిల్లులు, రైతులకు కనీస మద్దత ధర పెంచడం హర్షనీయమని కిసాన్ మోర్చా రాష్ట్ర బ్యాంకింగ్ సెల్ కన్వీనర్ రమణ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చెరకు క్వింటాకు రూ. 25, రైతులకు కనీస మద్దత ధర రూ. 340 లకు పెంచడం ఆనందకరమన్నారు.

సంప్రదాయబద్ధంగా సదస్యం

సింహచలం, ఫిబ్రవరి 22 : వరాహలక్ష్మీనృసింహ స్వామి ఉపాలయాల్లో జరుగుతున్న వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం వైదిక పండిత సదస్యులు సంప్రదాయద్ధంగా నిర్వహించారు. కొండదిగువ పూదోటలో కొలువైన పద్మావతి, అలమేలుమంగా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలోనూ, సింహగిరి క్షేత్రపాలకుడు బాల సుందరి సహిత త్రిపురాంతకస్వామి ఆలయంలో వెంకన్న ఉత్సవమూర్తిని దేవేరులతో పలు రకాల పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు భార్గవ్, రఘు ఆగమ పాఠశాల ఇన్ చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంతాచార్యులు ఆగమశాస్త్రోక్త విధానంలో మండపారాధన, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసిన పవిత్ర జలాలతో పూజా ద్రవ్యాలను, భక్తులను ప్రోక్షణ చేసి, షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పండితులు గోదావరి సురేష్, ఘనాపాటి శర్మ, పోతరాజు పవన్ కుమార్,కోట అనూష్‌కుమార్, మధుర సోమయాజులు, కపిలవాయ్ నరసింహమూర్తి శర్మ, తెన్నేటి సంతోష్‌కుమార్ శర్మ, ఆగమ పాఠశాల విద్యార్థులు చతుర్వేదాలను,ఉపనిషత్‌లను పఠించారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు రాజగోపాల్ మాట్లాడుతూ వేదపండిత సదస్యం విశిష్టతను వివరిస్తూ భగవంతుని దర్శింపజేసేవి వేదాలేనని చెప్పారు.



సదస్యంలో పాల్గొన్న పండితులు



ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఓపీఎస్ హామీని మేనిఫెస్టోలో చేర్చాలి : యూటీఎఫ్

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 22 : తెలుగుదేశం పార్టీ ప్రకటించే ఎన్నికల మేనిఫెస్టోలో ఓపీఎస్ హామీని చేర్చాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. గురువారం వారు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు ప్రభాకర్‌రావు, చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి జేవీ పద్మావతి, సభ్యులు మురళీ, గోవింద్, ఝాన్సీ, మూర్తి పాల్గొన్నారు.

జైలు రోడ్డులో పేరుకుపోయిన చెత్త



సర్వీసు రోడ్డులో ఉన్న చెత్త కుప్ప

ఆరిలోవ, ఫిబ్రవరి 22 : ముడసర్లోవ నుంచి కేంద్ర కారాగారానికి వెళ్లే సర్వీసు రోడ్డుకి ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దీంతో ఇటువైపుగా రాకపోకలు సాగిస్తున్న వారు దుర్వాసనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కమిషనర్ సాయికాంత్ వర్మ గతంలో ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు తక్షణమే చెత్త కుప్పలను తొలగించాలని ఆదేశించారు. కానీ జీవీఎంసీ సిబ్బంది ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఈ మార్గంలో రోజురోజుకి చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డులా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

సంస్థల మధ్య ఆరోగ్యకరమైన పోటీ అవసరం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 22 : వాణిజ్య రంగంలో సంస్థల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, అందుకు భారత ప్రభుత్వ కాంపిటేషన్ చట్టం - 2002 ఉపయోగపడుతుందని కాంపిటేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా న్యాయ విభాగం డైరెక్టర్ సుకేష్‌మిశ్రా అన్నారు. గురువారం గీతం యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోటీ వాతావరణంలో సంస్థలు ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించడానికి అనైతిక మార్గాలను అనుసరించకుండా కాంపిటేషన్ చట్టం నిరోధిస్తుందని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ డాక్టర్ అనితారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాగార్జున వర్సిటీ మాజీ వీసీ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఏసీఎం విభాగం సమావేశం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 22 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగానికి అనుబంధంగా ఉన్న అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మెషినరీ (ఏసీఎం) విద్యార్థి విభాగం ప్రత్యేక సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ డేటా సైన్స్ నిపుణుడు డాక్టర్ డి. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కృత్రిమ మేధ, డేటా సైన్స్, డేటా మైనింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో సమూల మార్పులు తీసుకువస్తున్నాయని తెలిపారు. డేటా సైన్స్ నిపుణులు పైథాన్, ఆర్.కంప్యూటర్ లాంగ్వేజలతో పాటు పవర్‌బిఐ, టెన్సార్‌ఫ్లో, సికిట్ లెర్న్ వంటి ఉపకరణాలను వినియోగిస్తున్నారని,విద్యార్థులు వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ కె. నాగేంద్ర కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహచలం, ఫిబ్రవరి 22 : వరాహలక్ష్మీనృసింహస్వామికి స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేశారు.బేడా మండప ప్రదక్షిణ తరువాత భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనమలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళితో స్వర్ణ సంపెంగలతో స్వామిని అర్చించారు. మంత్రపుష్పం, మంగళ నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



సైకిలింగ్‌తో శరీరానికి కొత్త ఉత్సాహం



సైకిళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆరిలోవ, ఫిబ్రవరి 22 : సైకిలింగ్ శరీరానికి చక్కటి వ్యాయామం అని చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీ కంఠనాథ రెడ్డి అన్నారు. గురువారం ఆయన జూపార్కులో సదరన్ గ్రూప్ ద్వారా ఏర్పాటు చేసిన నూతన టెక్నాలజీతో కూడిన సైకిళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతో కూడిన ఈ సైకిళ్ల ద్వారా సందర్శకులు జూలోని జంతువులను చూడవచ్చునని చెప్పారు. బ్యాటరీతో నడిచే ఈ సైకిళ్లు పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని అందిస్తాయన్నారు. జూ మెయిన్ గేట్ వద్ద, సాగర్ గేట్ వద్ద ప్రస్తుతం 10 సైకిళ్లు ఉంచామని తెలిపారు. గంటకు రూ. 70 అద్దె నిర్ణయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ డాక్టర్ నదనీ సలారియా, డీసీఎఫ్ మంగమ్మ, సదరన్ గ్రూప్ సీఎండీ సతీష్, జూఅసిస్టెంట్ క్యూరేటర్ గోపాల్‌నాయడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

ఆరిలోవ, ఫిబ్రవరి 22 : విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొద్ది రోజులుగా రోజూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు వరకు సరఫరా ఉండదని అధికారులు ప్రకటిస్తున్నారు. కానీ ఒక్కోసారి సాయంత్రం ఏడు వరకు సరఫరా ఇవ్వడం లేదు. దీంతో పిండి మిల్లులు, కార్పెంట్ వర్క్స్, గ్రిల్స్ తదితర వ్యాపారులకు కరెంట్ లేక పనులు సాగడం లేదు. అలాగే ఇళ్లల్లో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వేసవి రాకముందే పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

సిరిపురం, ఫిబ్రవరి 22 : అర్హులైన ప్రతి జర్నలిస్టుకి ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బి. రవికాంత్ నేతృత్వంలో పలువురు జర్నలిస్టులు గురువారం తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో సజ్జలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు జీవోలో ఎదరవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.